http://www.agnidharanews.com

# అగ్నిధార

నిజాల నిప్పు కణిక

ఎడిటర్: చేగొండ రవి కుమార్ యాదవ్

సోమవారం 7 జూలై 2025

పేజీలు : 5 వెల : 5/-

Published from Peddapalli Ciculated by Hyderabad, , , Sangareddy, jagityala, Rangareddy, Khammam,Medchal Medak Siddipet, Nalgonda, , warangal, Nizamabad

## విలేకరులు కావలెను

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ.. అవినీతిపై సమరాన్ని సాగిస్తున్న అగ్నిధార తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల వారికి అవకాశం కలదు. అన్ని జిల్లాలు, డివిజన్లు, మున్సిపల్ మరియు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను.

ఆసక్తి కలిగినవారు సంప్రదించగలరు

సెల్ : 80088 17828



# సాదాబైనామా కొలిక్కి వచ్చేనా?

- సాదాబైనామాల కోసం 8.9 లక్షల దరఖాస్తులు
- క్రమబద్ధీకరిస్తే 20 లక్షల ఎకరాలకు పైగా పట్టాలు
- 40 శాతం దరఖాస్తులు సాదాబైనామాల క్రమబద్ధీకరణ పైనే
- భూభారతి చట్టంలో పలు సెక్షన్లు చేర్చిన ప్రభుత్వం
- కోర్టు ఆదేశాలకు అనుగుణంగా ముందుకు వెళ్లాలని రెవెన్యూ శాఖ నిర్ణయం


సాదాబైనామాల క్రమబద్ధీకరణ కోసం లక్షల మంది ఎదురుచూస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన రెవెన్యూ సదస్సు నిర్వహించింది. ఈ సదస్సులో భూసమస్యల పరిష్కారం కోసం 8.90 లక్షల దరఖాస్తులు అందాయి. ఇందులో 40శాతం వరకు సాదాబైనామాల క్రమబద్ధీకరణకు సంబంధించినవే ఉన్నాయి. వీటిని క్రమబద్ధీకరిస్తే 20 లక్షల ఎకరాలకు పట్టాలు రానున్నాయి. న్యాయస్థానంలో కేసు ఉండటంతో ఉత్తర్వుల కోసం రెవెన్యూశాఖ నిరీక్షిస్తోంది.

8.90 లక్షల మంది దరఖాస్తు : రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో 8.90 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 40 శాతం దరఖాస్తులు సాదాబైనామాల క్రమబద్ధీకరణపైనే ఉన్నాయి. కొత్త రెవెన్యూ చట్టం భూభారతిలో. క్రమబద్ధీకరణకు పలు సెక్షన్లను చేర్చడంతో బాధితులు ఆశతో ఎదురుచూస్తున్నారు. రాష్ట్రంలో 2016లో తొలిసారి సాదాబైనామాల క్రమబద్ధీకరణ చేపట్టారు. 2014 జూన్‌కు ముందు జరిగిన ఒప్పందాలను క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం నాడు ఉత్తర్వులు జారీ చేసింది. ఆ సంవత్సరం 11.19 లక్షల మంది అన్నదాతలు దరఖాస్తు చేయగా వారిలో 6.18 లక్షల మందిని అర్హులుగా గుర్తించి పట్టాలు పంపిణీ చేశారు. 2020లో మరోసారి ప్రభుత్వం అవకాశం కల్పించింది. కాగా ఆ సంవత్సరం అక్టోబరు 12 నుంచి 30 - మిగతా3లో




## బిహార్ గూండాల రాజ్యంగా మారిపోయింది

- నేడు బిహార్ దోపిడీ, కాల్పులు, హత్యల నీడలో నివసిస్తోంది
- రాష్ట్రంలో నేరాలు జరగడమనేది సాధారణంగా మారిపోయింది
- వీటిని నిర్మూలించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది
- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ



## రఫేల్ యుద్ధ విమానాలకు వ్యతిరేకంగా చైనా దుష్ప్రచారం..!

- ఫ్రెంచ్ ఇంటెలిజెన్స్ నివేదిక..!
- ఫ్రెంచ్ యుద్ధ విమానాల సామర్థ్యంపై సందేహాలను లేవనెత్తేందుకు ప్రయత్నిస్తోంది
- చైనా తమ యుద్ధ విమానాలు రఫేల్ కంటే మెరుగైన ప్రదర్శన చేసినట్లుగా డ్రాగన్ దేశం ప్రచారం



## హిమాచల్‌లో 75 మరణాలు..

- వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ విధింపు
- పలు జిల్లాలో భారీ నుంచి అతిభారీ వర్షాలు పడే ప్రమాదం
- హిమాచల్ ప్రదేశ్‌లో ఒక్క రోజులో 115-204 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది

# కాంగ్రెస్ ప్రభుత్వంతోనే పేదల సొంతింటి కల సాకారం



- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క
- ఇల్లు లేని పేదల బాధలను అర్థం చేసుకొని ప్రజా ప్రభుత్వం రూ.22,500 కోట్లతో తొలి ఏడాది 4.50లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు
- దేశంలో ఏ రాష్ట్రంలోనూ ఇన్ని ఇళ్లు ఇచ్చిన చరిత్ర లేదు
- రాష్ట్రంలో 1.20కోట్ల కుటుంబాలు ఉంటే.. 93లక్షల కుటుంబాలకు రేషన్ కార్డులు ఇచ్చి వారికి సన్న బియ్యం పంపిణీ

ఖమ్మం

పేదల సొంతింటి కల సాకారం కాంగ్రెస్ ప్రభుత్వ పాలనతోనే సాధ్యమవుతుందని తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఖమ్మం జిల్లాలో సొంత నియోజకవర్గం మధిరలో పర్యటించిన ఆయన.. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ఇల్లు లేని పేదల బాధలను అర్థం చేసుకొని ప్రజా ప్రభుత్వం రూ.22,500 కోట్లతో తొలి ఏడాది 4.50లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసినట్లు తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ ఇన్ని ఇళ్లు ఇచ్చిన చరిత్ర లేదన్నారు. రాష్ట్రంలో 1.20కోట్ల కుటుంబాలు ఉంటే.. 93లక్షల కుటుంబాలకు రేషన్ కార్డులు ఇచ్చి వారికి సన్న బియ్యం పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం ఏర్పడిన తొలి ఏడాదిలోనే 56 వేల ఉద్యోగాలు ఇచ్చినట్లు తెలిపారు. రూ.8వేల కోట్లతో నిరుద్యోగుల కోసం రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రవేశపెట్టామన్నారు. భారత రాష్ట్ర సమితి పదేళ్ల - మిగతా3లో



## అన్ని వర్గాలను వంచించిన చరిత్ర భాజపాది

- సీఎం రేవంత్‌కు భాజపా లేఖ.. మంత్రి పొన్నం ప్రభాకర్ ఫైర్
- "11ఏళ్ల క్రితం కేంద్రంలో అధికారంలోకి వచ్చిన భాజపా దేశ ప్రజలను అడుగడుగునా వంచించింది
- గత 3 ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రధాని విస్మరించి ప్రజల ఆశలపై నీళ్లు చల్లారు
- వాగ్ధానాలతో ఊదరగొట్టడం, విద్వేషాన్ని రెచ్చగొట్టడం, అబద్ధాలను ఆవిష్కరించడం తప్ప మీరు చేసిందేమీ లేదు.
- రైతులు, యువకులు, మహిళలు, పేదలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ.. ఇలా అన్ని వర్గాలను వంచించిన చరిత్ర మీది.

## నీళ్ల విలువ తెలియని వ్యక్తులా మన నాయకులు

- కాళేశ్వరం బటన్ నొక్కితే నీరు వచ్చే పరిస్థితి ఉన్నా ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారు?
- 'కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రతీరోజు ఏ నదిలో ఎంత నీరు ఉందో తెలుసుకునేవారు
- కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం వాటిని విస్మరిస్తోంది
- నీళ్ల విలువ తెలియని నాయకులు మనకు పాలకులుగా ఉన్నారు.
- మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు



తెలంగాణభవన్

నీళ్ల విలువ తెలియని నాయకులు తెలంగాణలో పాలన చేస్తున్నారని మండిపడ్డారు మాజీ మంత్రి హరీష్ రావు. కాళేశ్వరం బటన్ నొక్కితే నీరు వచ్చే పరిస్థితి ఉన్నా ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారు? అని ప్రశ్నించారు. మోటర్లు ఆన్ చేయని పక్షంలో రైతులతో కన్నెపల్లి వైపు కదులుతామని హరీష్ రావు హెచ్చరించారు. మాజీ మంత్రి, బీఆర్ఎస్ - మిగతా3లో



## రాజకీయ రంగంలోకి ఎలాన్ మస్క్

- పార్టీ గుర్తును రెండు తలల పాము మీమ్
- ది అమెరికా పార్టీ' అనే పేరుతో మూడో రాజకీయ శక్తిని ప్రకటించిన మస్క్
- త్వరలోనే పార్టీ లోగో ప్రకటన

## రైతు భరోసా లేదు.. రైతు రుణమాఫీ లేదు

- రైతుకు బస్తా ఎరువు ఇవ్వలేని స్థితి ఎందుకుంది..
- రాష్ట్రవ్యాప్తంగా 1.94 లక్షల మెట్రిక్ టన్నుల లోటు ఎందుకుందో రైతులకు వివరించాలి
- కాంగ్రెస్ సర్కార్‌పై కేటీఆర్ ధ్వజం



హైదరాబాద్

రాష్ట్రంలో ఎరువుల కొరత నేపథ్యంలో కాంగ్రెస్ సర్కార్‌పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. రైతు భరోసా లేదు.. రైతు రుణమాఫీ లేదు.. కనీసం అప్పు తెచ్చి వ్యవసాయం చేద్దామంటే ఆఖరికి ఎరువులకు కూడా కరువొచ్చిందని అన్నారు. మీరు అడిగినట్టు ఆధార్ కార్డులు ఇచ్చినా, రైతుకి కనీసం బస్తా ఎరువు ఇవ్వలేని స్థితిలో ప్రభుత్వం - మిగతా3లో

# రఫేల్ యుద్ధ విమానాలకు వ్యతిరేకంగా చైనా దుష్ప్రచారం!

ఫ్రాన్స్‌కు చెందిన రఫేల్ యుద్ధ విమానాలకు వ్యతిరేకంగా చైనా రాయబార కార్యాలయాల ద్వారా ప్రచారం చేస్తోందని.. ఫ్రెంచ్ యుద్ధ విమానాల సామర్థ్యంపై సందేహాలను లేవనెత్తేందుకు ప్రయత్నిస్తోందని ఫ్రెంచ్ సైనిక, నిఘా సంస్థలు ఓ నివేదికలో వెల్లడించాయి. ఇటీవల భారత్-పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతలు నెలకొన్న విషయం తెలిసిందే. అప్పటి నుంచి ఈ ప్రచారం భారీగా పెరిగింది. చైనా తమ యుద్ధ విమానాలు రఫేల్ కంటే మెరుగైన ప్రదర్శన చేసినట్లుగా డ్రాగన్ దేశం ప్రచారం చేసుకుంటున్నది. నివేదికల ప్రకారం.. చైనా రాయబార కార్యాలయాల్లో పోస్ట్ అయిన రక్షణశాఖ అధికారులు వివిధ దేశాలను రఫేల్ యుద్ధ విమానాలను కొనుగోలు చేయొద్దని పట్టుబడుతున్నట్లుగా పేర్కొన్నాయి. రఫేల్ జెట్‌లను కొనుగోలు చేసే అంశాన్ని పరిశీలిస్తున్న ఇండోనేషియాను ఒప్పించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. అయితే, చైనా తన యుద్ధ విమానాలను ప్రమోట్ చేసేందుకు ప్రయత్నిస్తున్నది. వాటిని కొనుగోలు చేయాలని ఆయా దేశాలపై ఒత్తిడి తీసుకువస్తున్నది. పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత మే నెలలో భారత్-పాకిస్తాన్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు చోటు చేసుకున్న విషయం తెలిసిందే. భారత్ మిస్సైల్స్, యుద్ధ విమానాలను ఉపయోగించి పాక్‌లోని ఉగ్రస్థావరాలను నేలమట్టం చేసింది. అయితే, పాక్ వాడిన చైనా తయారు చేసిన ఆయుధాలు, ముఖ్యంగా యుద్ధ విమానాలతో పాటు భారతదేశం వాడిన ఫ్రెంచ్‌లో తయారైన రఫేల్ యుద్ధ విమానాలకు వ్యతిరేకంగా ఎలా పని చేశాయో తెలుసుకునేందుకు సైనిక నిపుణులు ప్రయత్నిస్తున్నారు. మూడు రఫేల్ జెట్లతో సహా ఐదు భారత యుద్ధ విమానాలను కూల్చివేసినట్లుగా పాకిస్తాన్ చెప్పుకుంటున్నది. అయితే, అయితే, ఫ్రెంచ్ వైమానిక దళ చీఫ్ జనరల్ జెరోమ్ బెల్లాంజర్ మాట్లాడుతూ.. ఉద్రిక్తతల సమయంలో భారత్ ఒక



రఫేల్ యుద్ధ విమానం.. ఒక సుఖోయ్, మిరాజ్2000 సహా మూడు యుద్ధ విమానాలను మాత్రమే కోల్పోయి ఉండవచ్చన్నారు. ఫ్రాన్స్ రఫేల్ యుద్ధ విమానాలను విక్రయించిన అన్ని దేశాల్లో రఫేల్ లక్ష్యంగా చేసుకోవడం ఇదే తొలిసారి. యుద్ధ విమానం కూల్చివేసినట్లయితే ఆ దేశాన్ని దాని గురించి ప్రశ్నించాలని జెల్లాంజర్ పేర్కొన్నారు. రఫేల్, సంబంధిత పరికరాలు ఫ్రాన్స్ ఆయుధ ఎగుమతుల్లో కీలకం. వివిధ దేశాలతో ఫ్రాన్స్ సంబంధాలను మెరుగుపరచడానికి ఇది ప్రధాన మార్గం. ముఖ్యంగా ఆసియాలో చైనా తన ఆధిపత్యాన్ని పెంచుకుంటున్నది. ఈ రోజుల్లో ఫ్రాన్స్ సైతం చైనా ప్రచారాన్ని ఎదుర్కొంటున్నది. ఇందులో పాకిస్తాన్‌తో పాటు చైనా ఉన్నది. సోషల్ మీడియాలో పలు పోస్టులు వైరల్ అవుతున్నాయి. రఫేల్ ఫేక్ ఫొటోలను ప్రచారం చేస్తున్నారు. ఏఐతో జనరేటెడ్ కంటెంట్, వీడియో గేమ్ క్లిప్పింగ్‌తో రఫేల్‌ను అపఖ్యాతి పాలు చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. భారత్-పాక్ మధ్య వివాదం తర్వాత వెయ్యికిపైగా సోషల్ మీడియా ఖాతాలను సృష్టించగా.. అవన్నీ చైనాకు సాంకేతికను ప్రచారం చేసేందుకు ప్రయత్నించడం గమనార్హం. అయితే, ఇందులో చైనా ప్రభుత్వం ప్రమేయం ఉందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

# రాజకీయ రంగంలోకి ఎలాన్ మస్క్

**వాషింగ్టన్:** అమెరికా రాజకీయాల్లో కీలక మలుపు అంటూ,. ప్రపంచ కుబేరుడు, టెక్ దిగ్గజం ఎలాన్ మస్క్ రాజకీయ రంగంలోకి వస్తున్నానంటూ ఆయన స్వయంగా షేర్ చేసిన కొత్త పార్టీ ప్రకటన.. తాజాగా పెద్ద చర్చకు దారి తీసింది. దీ అమెరికా పార్టీ' అనే పేరుతో మూడో రాజకీయ శక్తిని ప్రకటించిన మస్క్, ఆ పార్టీకి రెండు తలల పాము మీమ్‌ను షేర్ చేశారు. కానీ మస్క్ నిజంగానే కొత్త పార్టీని పెట్టారా.. ?లేక జనాల్ని వెర్రివాళ్లను చేయడానికే ఇలా చేశారా అనేది ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. ఎందుకంటే.. అమెరికన్ చట్టాల ప్రకారం..ఆయన అధ్యక్షుడిగా ఎన్నికల బరిలోకి దిగేందుకు అనర్హులు. దీంతో మస్క్ కొత్త పార్టీపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నా యి. మస్క్ అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికల్లో పోటీ చేస్తారా? లేదంటే.. కొత్త పార్టీ లేదు. ఏమీ లేదు. తూచ్ అని పక్కకు తప్పుకుంటారా? అని చూడాల్సి ఉండగా.. మస్క్ 2028లో జరిగే అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేయాలనుకున్నా, అమెరికన్ రాజ్యాంగ నిబంధనల ప్రకారం ఆయన అనర్హులు. ప్రస్తుత అమెరికా రాజ్యాంగాల ప్రకారం.. ఆర్టికల్ 2, సెక్షన్ 1 ప్రకారం.. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేసేందుకు సదరు అభ్యర్థి అమెరికా పౌరుడై ఉండాలి. తద్వారా మస్క్‌కు అర్హత లేదు. కారణం ఆయన జన్మస్థలం దక్షిణాఫ్రికా కావడం.

**మస్క్ పార్టీపై సవాలక్ష ప్రశ్నలు**

ఈ నేపథ్యంలో, మస్క్ పార్టీ విస్తరణకు ముందు వ్యతిరేక వ్యతిరేక పవనాలు వీస్తున్నాయి. ఆయన మాత్రం అధ్యక్ష పదవిపై నిర్ణయం వచ్చే ఏడాది చెబుతానంటూ ట్వీట్ చేశారు. ఇంతకీ.. మస్క్ టార్గెట్ ఏంటి? అమెరికాను పాలించాలని చూస్తున్నారా? పార్టీగా ప్రభావం చూపాలని అనుకుంటున్నారా? అనేది సదరు అమెరికన్ పౌరుల్లో పుట్టుకొస్తున్న సవాలక్ష ప్రశ్నలు.. ఈ ప్రశ్నలన్నింటికి కాలమే సమాధానం చెప్పాల్సి ఉంది. ఈ క్రమంలో మస్క్ కొత్త పార్టీ ఏర్పాటు? అందుకు గల కారణాలు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి. అమెరికాలో ప్రస్తుతం అధికార, ప్రతిపక్ష రిపబ్లికన్, డెమోక్రాట్ పార్టీలు ప్రజల స్వేచ్ఛను హరించుతున్నాయని మస్క్ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్ట్ ట్రంప్ ప్రతిపాదించిన కీలక 'బిగ్ బ్యూటిఫుల్ బిల్' చట్టాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ బిల్లు ఆమోదం పొందిన వెంటనే, మస్క్ అమెరికా స్వాతంత్ర్య దినోత్సవం జులై 4న తన కొత్త పార్టీని ప్రకటించారు. ముందుగా కొత్త పార్టీ స్థాపన విషయంలో నెటిజన్ల



అభిప్రాయాల్ని సేకరించారు. కొత్త పార్టీకి మద్దతుగా 1.2మిలియన్ల మంది నెటిజన్లు స్పందించారు. దాదాపు 80 శాతం మంది మస్క్‌కు మద్దతు తెలిపారు. ఈ ఫలితాల ఆధారంగా, ప్రజల అభిప్రాయాన్ని గౌరవిస్తూ ఆయన కొత్త పార్టీని ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు.

త్వరలోనే పార్టీ లోగో ప్రకటన

పార్టీ పేరు ది అమెరికా పార్టీగా నామకరణం చేసినా.. పార్టీ గుర్తును రెండు తలల పాము మీమ్‌ను షేర్ చేస్తూ తన పార్టీ ప్రస్తుత రాజకీయ వ్యవస్థకు ప్రత్యామ్నాయంగా నిలబడుతుందనే సంకేతాలిచ్చారు. ఇది అధికారిక పార్టీ లోగోగా ప్రకటించలేదు కానీ.. ప్రారంభ దశలో పార్టీ భావజాలానికి ప్రతీకగా ఈ చిహ్నాన్ని ఉపయోగిస్తున్నారు. భవిష్యత్తులో పార్టీకి ప్రత్యేక లోగో, జెండా, రంగులు ప్రకటించే అవకాశం ఉంది.

వచ్చే ఏడాది ఎన్నికల్లో మస్క్ పోటీ

ఇక వచ్చే ఏడాది అమెరికాలో జరగనున్న మధ్యంతర ఎన్నికల్లో 2%-%3 సెనేట్ స్థానాలు, 8%-%10 ప్రతినిధుల సభ స్థానాల్లో ఎలాన్ మస్క్ పోటీ చేయనున్నారంటూ పలు నివేదికలు వెలుగులోకి వచ్చాయి. ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించడం, ప్రభుత్వ ఖర్చులను తగ్గించడం. తన పార్టీ ద్వారా ప్రజల గొంతుకను వినిపించడమే తన పార్టీ ఉద్దేశమనే నినాదాలతో ప్రజల్లోకి వెళ్లనుంది.

ఎన్నికల్లో మస్క్ లేజర్ ఫోకస్ వ్యూహం

అమెరికాలో ప్రతినిధుల సభ సభ్యుల పదవీకాలం కేవలం 2 సంవత్సరాలు. పదవీ కాలం పూర్తయిన వెంటనే ప్రతినిధుల సభలోని 435 స్థానాలకు, సెనేట్ లోని 34 స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. తన పార్టీ సైతం ఈ ఎన్నికల బరిలో దిగేలా ఎలాన్ మస్క్ లేజర్ ఫోకస్ వ్యూహాన్ని అమలు చేయనున్నారు. ఈ స్ట్రాటజీ ప్రకారం దేశంలోని అన్నీ స్థానాల్లో పోటీ చేయకుండా.. కేవలం గెలిచే స్థానాల్లో పోటీకి దిగడం, గెలుపు సమీకరణాల్ని మార్చే ప్రయత్నం చేయడం వంటి అంశాలు దీని కిందకే వస్తాయి.

**మస్క్ ముందున్న సవాళ్లు**

కాగా,మస్క్ సంపద, ప్రభావం ఉన్నప్పటికీ, మూడో పార్టీగా ఎదగడం సవాలుతో కూడుకున్నదే. గతేడాది అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ తరుపున మస్క్ ప్రచారం చేశారు. ఆ సమయంలో నేను అమెరికా అధ్యక్షుడిని కాలేను. ఎందుకంటే? నేను సౌతాఫ్రికాలో జన్మించాను. మా తాత అమెరిన్. నేను ఆఫ్రికన్. కాబట్టి నేను అమెరికాకు అధ్యక్షుడిని కాలేను. రాకెట్లను, కార్లను నిర్మించడమే తన లక్ష్యమని చెప్పుకున్న మస్క్ ఇప్పుడు అకస్మాత్తుగా పార్టీ ప్రకటించడం.. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేయాలని ఉందని పరోక్ష సంకేతాలివ్వడంపై అమెరికన్లు పెదవి విరుస్తున్నారు. మస్క్‌కు ఎలక్షన్ ఎర్రి ఉందంటూ మండిపడుతున్నారు.

# ఇతరుల జోక్యం లేకుండా'.. దలైలామాకు అమెరికా శుభాకాంక్షలు

**వాషింగ్టన్:** ఈరోజు (జూలై 6) టిబెటన్ల ఆధ్యాత్మిక గురువు దలైలామా పుట్టినరోజు. ఈ సందర్భంగా ఆయనకు ప్రపంచం నలుమూలల నుంచి శుభాకాంక్షలు అందుతున్నాయి. అయితే అమెరికా దలైలామాకు ప్రత్యేక సందేశంతో శుభాకాంక్షలు తెలిపింది. ఒకవైపు టిబెటిన్లకు మద్దతు పలుకుతున్నట్లు, మరోవైపు చైనాను హెచ్చరిస్తున్నట్లు అమెరికా సందేశం ఉండటం విశేషం. 90వ పుట్టినరోజు జరుపుకుంటున్న దలైలామాకు అమె రికా శుభాకాంక్షలు తెలియజేస్తూ.. టిబెటన్లు తమ మత పెద్దలను స్వేచ్ఛగా, 'ఇతరుల జోక్యం లేకుండా' ఎన్నుకునే సామర్థ్యాన్ని కాపాడుకునేందుకు అమెరికా మద్దతు ఇస్తుందని పేర్కొంది. ప్రపంచానికి దలైలామా ఐక్యత, శాంతి, కరుణల సందేశాన్ని అందిస్తూ, ప్రజల్లో శాంతి నెలకొల్పుతున్నారని అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో పేర్కొన్నారు. చైనా పేరు ఎత్తకుండానే రూబియో.. టిబెటన్ల సాంస్కృతిక, మత స్వేచ్ఛకు అమెరికా మద్దతు ఇస్తుందనే సందేశాన్ని తెలియజేశారు. టిబెటన్ల హక్కులు, ప్రాథమిక స్వేచ్ఛల పట్ల



గౌరవాన్ని పెంపొందించేందుకు యునైటెడ్ స్టేట్స్ కట్టుబడి ఉందన్నారు. టిబెటన్ల ప్రత్యేక భాష, సాంస్కృతిక, మతపరమైన వారసత్వాన్ని కాపాడే ప్రయత్నాలకు తాము మద్దతు ఇస్తున్నామని, ఇతరుల జోక్యం లేకుండా వారు మత పెద్దలను స్వేచ్ఛగా ఎన్నుకునే సామర్థ్యాన్ని కాపాడుతామని అన్నారు. తదుపరి దలైలామాను ఎన్నుకునే హక్కు తమకే ఉందని చైనా చెబుతున్న ప్రస్తుత తరుణంలో అమెరికా వ్యాఖ్యలు కీలకంగా మారాయి. కాగా టిబెట్‌పై చైనా చారిత్రక అధికారాన్ని డిమాండ్ చేస్తోంది. సామ్రాజ్య యుగం నాటి సంప్రదాయాలను గుర్తుచేస్తూ, తదుపరి దలైలామాను ఆమోదించే హక్కు తమకే ఉందని బీజింగ్ తరచూ చెబుతోంది. టిబెట్‌లో అనుసరించే మతపరమైన ఆచారాలపై కఠినమైన నియంత్రణను కొనసాగిస్తోంది.

## బిహార్ గూండాల రాజ్యంగా మారిపోయింది

**ఇంటర్నెట్ డెస్క్:** బిహార్ ప్రభుత్వంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. బిహార్ రాజధాని పట్నాలో ప్రముఖ వ్యాపారవేత్త గోపాల్ ఖేమ్కా హత్యపై రాహుల్ మాట్లాడుతూ.. నీతీష్ కుమార్ ప్రభుత్వం రాష్ట్రాన్ని గూండాల రాజ్యంగా మార్చిందని దుయ్యబట్టారు.



నేడు బిహార్ దోపిడీ, కాల్పులు, హత్యల నీడలో నివసిస్తోందని.. రాష్ట్రంలో నేరాలు జరగడమనేది సాధారణంగా మారిపోయిందన్నారు. వీటిని నిర్మూలించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. రాష్ట్ర పౌరులను రక్షించలేని పార్టీకి రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలెవరూ ఓటువేయొద్దని విజ్ఞప్తి చేశారు. దారుణాలు, దోపిడీలను పూర్తిగా నిర్మూలించి, పురోగతి వైపు అడుగులు వేసే సమయం బిహార్‌కు వచ్చిందని రాహుల్ పేర్కొన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో వేసే ఓట్లు కేవలం ప్రభుత్వాన్ని మార్చడానికే కాక.. రాష్ట్రాన్ని రక్షించడానికి ఉపయోగపడతాయన్నారు. ప్రజలు ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని తగిన నిర్ణయం తీసుకోవాలని సూచించారు. పట్నాలో గాంధీ మైదాన్ ఠాణా పరిధిలోని రాంగులాం చౌక్ పనాష్ హోటల్ సమీపంలో గోపాల్ ఖేమ్కా దారుణ హత్యకు గురయ్యారు. శుక్రవారం రాత్రి 11.40 గంటల సమయంలో తన ఇంటికి చేరుకున్న ఆయన కారు దిగుతుండగా బైక్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు విచక్షణా రహితంగా కాల్పులు జరపడంతో అతడు మృతి చెందాడు. ఈ ఘటన బిహార్ రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపింది. దీనిపై ఆర్జేడీ చీఫ్ తేజస్వి యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గోపాల్ ఖేమ్కాను దుండగులు పట్నా నడిబొడ్డున హత్య చేస్తే.. అక్కడికి పోలీసులు రావడానికి రెండు గంటల సమయం పట్టిందని పేర్కొన్నారు. ఆరేళ్ల క్రితం వ్యాపారవేత్త కుమారుడిని ఇదే విధంగా హత్య చేస్తే.. ఇప్పటికీ ఆ హంతకులను అరెస్టు చేయలేదని మండిపడ్డారు. రాష్ట్రంలో ప్రజల ప్రాణాలకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

## హిమాచల్‌లో 75 మరణాలు

**సిమ్లా:** హిమాచల్ ప్రదేశ్‌లో వర్ష బీభత్సం కొనసాగుతోంది. ఎడతెరిపిలేని భారీ వర్షాల కారణంగా ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక, హిమాచల్‌లోని మండి జిల్లాలో భారీ వర్షాల కారణంగా మరణాల వారి సంఖ్య 75కు చేరుకుంది. మరోవైపు.. పలు జిల్లాలో భారీ నుంచి అతిభారీ వర్షాలు పడే



ప్రమాదం ఉందని వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ విధించింది. హిమాచల్ ప్రదేశ్‌లో ఒక్క రోజులో 115-204 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. 204 మిల్లీ మీటర్లు అతి తీవ్ర వర్షపాతం కిందకు వస్తుంది. దీంతో, రాష్ట్రవ్యాప్తంగా ప్రధాన రహదారులపై కొండచరియలు విరిగిపడ్డాయి. దాదాపు 240 రహదారులపై రాకపోకలు కష్టంగా మారినట్లు అధికారులు వెల్లడించారు. ఆకస్మిక వరదలు, కుంభవృష్టితో పరిస్థితి దారుణంగా మారింది. ఎడతెరిపిలేని వర్షం కారణంగా చాలా చోట్ల సహాయక చర్యలకు ఆటంకం ఏర్పడుతోంది. వీటిల్లో ఒక్క మండి జిల్లాలోనే 176 మార్గాలున్నాయి.

**రెడ్ అలర్ట్ జారీ..**

హిమాచల్ ప్రదేశ్‌లోని కంగ్రా, సిర్మూర్, మండి జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు పడే ప్రమాదం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. రెడ్ అలర్ట్ విధించింది. అలాగే, రానున్న 24 గంటల్లో చంబా, కంగ్రా, మండి, శిమ్లా, సిర్మూర్ జిల్లాల్లో మెరుపు వరదలు రావొచ్చని హెచ్చరించింది. ఉనా, బిలాస్‌పుర్, హమీర్‌పుర్, చంబా, శిమ్లా, కుల్లు జిల్లాలో ఆరెంజ్ అలర్ట్ ప్రకటించారు. చాలా చోట్ల కొండచరియలు విరిగి పడే ప్రమాదం ఉందన్నారు. బలహీనమైన నిర్మాణాల్లో ప్రజలను ఉండొద్దని హెచ్చరించారు. మరోవైపు.. సహాయక చర్యల్లో ఐటీబీపీ దళాలు పాల్గొంటున్నాయి.

## టెక్సాస్‌లో వరదలు..


## 51 మంది మృతి.. పలువురు గల్లంతు

అగ్ర రాజ్యం అమెరికా లోని టెక్సాస్ రాష్ట్రాన్ని వరదలు ముంచెత్తాయి. గత కొన్ని రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు అక్కడి నదులు పొంగిపొర్లుతున్నాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వర్షాలు, వరదల వల్ల 51 మంది ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో 15 మంది చిన్నారులు ఉన్నారు. వరదల్లో చిక్కుకున్న 200 మందికిపైగా పౌరులను సహాయక బృందాలు రక్షించాయి. మరోవైపు కెర్ కౌంటీలోని గ్వాడలూప్ నది ఉప్పొంగి సమీపంలోని మిస్టిక్ క్యాంప్ వేసవి శిక్షణా శిబిరాన్ని ముంచెత్తింది. దాంతో ఆ శిబిరంలోని 23 మంది అమ్మాయిలు గల్లంతయ్యారు. వారి కోసం రెస్క్యూ టీమ్స్ తీవ్రంగా గాలిస్తున్నారు.

## బ్యాంక్ ఆఫ్ లండన్ పక్కనే..

## చైనా గూఢచర్య కేంద్రం..!

**ఇంటర్నెట్‌డెస్క్:** లండన్‌లో చైనా నిర్మించ తలపెట్టిన భారీ దౌత్యకార్యాలయం ఇప్పుడు యూకేకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. ఈ విషయాన్ని డెయిలీ మెయిల్ పత్రిక కథనంలో పేర్కొంది. టవర్ లండన్ సమీపంలోని రాయల్ మింట్ వద్ద ఇది ఉండటమే దీనికి కారణం.



గతంలో యూకే నిఘా సంస్థ ఎంఐ5, స్కాట్లాండ్ యార్డ్ హెచ్చరించడంతో చైనా కార్యాలయానికి అనుమతులు నిలిపివేశారు. కానీ, ప్రభుత్వం మారిన తర్వాత మళ్లీ పునరుద్ధరించారు. సున్నితమైన ఫైనాన్షియల్ సెంటర్ సమీపంలో చైనా దౌత్యకార్యాలయం నిర్మించడంపై బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ కూడా ప్రధాన మంత్రి కార్యాలయానికి అభ్యంతరాలను పంపింది. చైనా దౌత్యకార్యాలయ స్థలం అత్యంత సమీపంలోనే మూడు భారీ డేటా సెంటర్లు, స్టాక్ ఎక్స్ఛేంజి కూడా ఉన్నాయి. చైనా చేపట్టిన నిర్మాణంలో బేస్‌మెంట్ సూట్లు, సొరంగం ఉన్నట్లు కూడా గతేడాది వార్తలొచ్చాయి. గూఢచర్యం కోసం అవసరమైన నిర్మాణాలు చేస్తోందని డెయిలీ మెయిల్ వెల్లడించింది. ఈ భవనంలోని కల్చరల్ ఎక్స్ఛేంజి విభాగాన్ని మాత్రం యూకే అధికారుల తనిఖీ నుంచి మినహాయించాలని చైనా అధికారులు భావిస్తున్నారు. సాధారణంగా గూఢచర్యం కోసం వాడే వాటిని కల్చరల్ ఇంట్రెస్ట్స్, ఎక్స్ఛేంజిగా పేర్కొంటారని అమెరికాకు చెందిన మాజీ సెక్యూరిటీ అధికారి వెల్లడించారు.

**ఏమిటీ మెగా ఎంబసీ..**

2018లో బ్రిటన్ రాయల్ మింట్‌కు చెందిన 5.4 ఎకరాల భూమిని చైనా కొనుగోలు చేసింది. 1809-1967 మధ్యలో బ్రిటన్ రాయల్ మింట్‌లో ఇది భాగమే. అంతకు ముందు బ్లాక్ డెత్‌ప్లేగు సమాధులు ఇక్కడున్నాయి. రాయల్ నేవీ కూడా కొన్నాళ్లు ఈ స్థలాన్ని వినియోగించుకొంది. ఇది టవర్ ఆఫ్ లండన్‌కు అత్యంత సమీపంలోనే ఉంది. బ్రిటన్ రాజకుటుంబం ఈ ప్రదేశాన్ని రియల్ ఎస్టేట్ డెవలపర్లకు విక్రయించింది. దీంతో చైనా కొనుగోలు చేయడం తేలికైంది. దీనిని ఐరోపాలోనే అతిపెద్ద దౌత్యకార్యాలయంగా నిర్మించాలని బీజింగ్ నిర్ణయించింది. ఇందులో 225 ఇళ్లు, కల్చరల్ ఎక్స్ఛేంజి భవనం కూడా ఏర్పాటు చేసేలా ప్లాన్ చేసింది. వాషింగ్టన్ డీసీలోని దౌత్యకార్యాలయం కంటే ఇది రెండు రెట్లు పెద్దగా ఉంటుంది. కొన్ని నెలల క్రితం చైనా దౌత్యకార్యాలయ నిర్మాణంపై ఆందోళనలు కూడా జరిగాయి.

# నీళ్ల విలువ తెలియని వ్యక్తులా మన నాయకులు

-మొదటిపేజీ తరువాయి

ఎమ్మెల్యే హరీష్ రావు తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. 'కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రతీరోజు ఏ నదిలో ఎంత నీరు ఉందో తెలుసుకునేవారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం వాటిని విస్మరిస్తోంది. నీళ్ల విలువ తెలియని నాయకులు మనకు పాలకులుగా ఉన్నారు. ఇప్పుడు నీరు వస్తున్నా వాటిని కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. బటన్ నొక్కితే నీరు వచ్చే పరిస్థితి ఉన్నా ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారు?. కాళేశ్వరం మోట్లరు ఆన్ చేస్తే 15 జిల్లాలకు మేలు జరుగుతుంది. వెంటనే కాళ్లేశ్వరం మోటర్లు ఆన్ చేయండి. కాళేశ్వరం నీటితో రిజర్వాయర్లు నింపండి. లేదంటే లక్షలాది మంది రైతులతో కన్నెపల్లి వైపు కదులుతాం' అని హెచ్చరికలు జారీ చేశారు.



కాళేశ్వరానికి మాత్రమే NDSA వర్తిసుందా? SLBC కి NDSA వర్తించదా?. కాంగ్రెస్ పార్టీ చిల్లర రాజకీయాలకు ప్రాధాన్యత ఇస్తుంది. అన్నదాతకు అక్షయ పాత్ర కాళేశ్వరం. మేడిగడ్డతో సంబంధం లేకుండా గోదావరి నీళ్ళను ఎత్తి పోయేచ్చు. పాలమూరు బిడ్డ అయిన రేవంత్ రెడ్డి పాలమూరు ప్రజల నోరు కొడుతుండు. శ్రీశైలానికి వరద నీళ్లు వచ్చి 36 రోజుల అవుతుంది. కల్వకుర్తి మోటార్లు ఎందుకు ఆన్ చెయ్యడం లేదు. కల్వకుర్తి మోటార్లు ఇప్పటికైనా ఆన్ చేస్తరా, లేదంటే రైతులను ఆన్ చెయ్యమంటరా?. భీమా, కోయిల్ సాగర్ మోటార్లు ఆన్ చేయడంలో పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. గేట్లు ఎత్తలేని దద్దమ్మ ప్రభుత్వం ఈ కాంగ్రెస్. కృష్ణా జలాల వాడుకోవడంలో ఈ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోంది. ఏపీకి నీళ్ళు ఇచ్చేందుకు రేవంత్ రెడ్డి చీకటి ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఇప్పటికైనా కన్నెపల్లి పంపు హౌస్ మోటార్లు ఆన్ చేసి సాగునీరు ఇవ్వాలని మేము డిమాండ్ చేస్తున్నాం అంటూ హెచ్చరించారు.

# సాదాబైనామా కొలిక్కి వచ్చేనా?

-మొదటిపేజీ తరువాయి

మధ్య ఇచ్చిన గడువులో 2.24 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. గడువును నవంబరు 10 వరకు పొడిగించగా 6.66 లక్షలు వచ్చాయి. మొత్తం 8.90 లక్షల మంది దరఖాస్తుదారులు దాదాపు 20 లక్షల ఎకరాల క్రమబద్ధీకరణకు ఎదురుచూస్తున్నారు.

**నిర్ణయానికి ఎదురుచూపు**

గత ప్రభుత్వ హయాంలో అందిన సాదాబైనామా దరఖాస్తులన్నీ రెవెన్యూశాఖకు చెందిన ఆన్‌లైన్‌లో ఉన్నాయా లేదా అనే సందేహాలు తలెత్తుతున్నాయి. కోర్టు ఆదేశాలకు అనుగుణంగా గతంలో ఒక దఫా దరఖాస్తుల పరిశీలన చేపట్టారు. అదే సమయంలో దరఖాస్తులేవీ పెండింగ్‌లో ఉండొద్దంటూ ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ఆదేశాలతో కొన్ని జిల్లాల కలెక్టర్లు ఎడాపెడా ఆన్‌లైన్‌లో తిరస్కరించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 22,509 దరఖాస్తులు వచ్చాయి. వాటిలో 12,947 దరఖాస్తులను తిరస్కరించారు. మహబూబాబాద్‌లో 37,129కి 20,792. నిజామాబాద్‌లో 10,122కి 9,504. వనపర్తిలో 3,654కి 3,408. నల్గొండలో 14,409కి 14,166. సంగారెడ్డిలో 3,669కి 2,726 దరఖాస్తులను తిరస్కరించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో 5,842 అందగా అన్నింటినీ తిరస్కరించారు. ప్రస్తుతం ఈ రైతుల్లో చాలా మంది తాజాగా నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో దరఖాస్తు చేసి ప్రభుత్వ నిర్ణయానికి ఎదురుచూస్తున్నారు.

**క్రమబద్ధీకరణ చేసేందుకు వీలు**

భూ దస్త్రాల యాజమాన్య హక్కుల చట్టం–ఆర్వోఆర్ 1971 సాదాబైనామాల క్రమబద్ధీకరణ చేసేందుకు వీలు కల్పిస్తోంది. 2020 అక్టోబరు 29న తెలంగాణ ప్రభుత్వం ఈ చట్టాన్ని రద్దు చేసింది. కొత్తగా 'తెలంగాణ పాసుపుస్తకాలు,



యాజమాన్య హక్కుల చట్టం'–ఆర్వోఆర్ 2020ను అమల్లోకి తెచ్చింది. సాదాబైనామాల క్రమబద్ధీకరణ చేయడం లేదంటూ కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఆర్వోఆర్ 2020లో సాదాబైనామాల క్రమబద్ధీకరణకు వీలు కల్పించే సెక్షన్లు ఏవీ లేవని న్యాయస్థానం పేర్కొంది.

కాగా ఆర్వోఆర్ 1971 చట్టం అమల్లో ఉన్న సమయంలో ప్రభుత్వానికి వచ్చిన దరఖాస్తులకు మాత్రమే అవకాశం కల్పించింది. దాని ప్రకారం 2020 అక్టోబరు 29కి ముందు అందిన 2.24 లక్షల దరఖాస్తుల క్రమబద్ధీకరణకు వీలు కల్పించింది. కానీ లక్షల్లో ఆర్జీలు రావడంతో చట్టసవరణ చేయడానికి వీలుగా ఆర్డినెన్స్ తీసుకురావాలని నాటి ప్రభుత్వం భావించింది. కాని అది కార్యాచరణలోకి రాలేదు. ఈ కేసు కోర్టులో కొనసాగుతూనే ఉంది. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక న్యాయపరమైన చిక్కులను తొలగించి సాదాబైనామాలకు అవకాశం కల్పించేందుకు అడుగులు వేసింది. కోర్టు నుంచి వచ్చే ఆదేశాలకు అనుగుణంగా క్రమబద్ధీకరణ విషయంలో ముందుకు వెళ్లాలని రెవెన్యూ శాఖ నిర్ణయించింది.

# తెలంగాణ కల్చరల్ సొసైటీ 12వ సర్వ సభ్య సమావేశం

**తెలంగాణ కల్చరల్ సొసైటీ (సింగపూర్) :** పన్నెండవ వార్షిక సర్వ సభ్య సమావేశం జూన్ 29వ తేదీన స్థానిక ఆర్య సమాజం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో సుమారు 30 మందికిపైగా సభ్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పదకొండవ సర్వసభ్య సమావేశపు వివరాలతో పాటు 2024–2025 ఆర్థిక సంవత్సరపు రాబడి, ఖర్చుల వివరాలను సభ్యులకు వివరించిన తరువాత పద్దులను ఉపాధ్యక్షులు భాస్కర్ గుప్త నల్ల ఆమోదించారు. ఈ సమావేశం సందర్భంగా సభ్యులు ముద్దం విజ్జేందర్ , గర్రెపల్లి శ్రీనివాస్, ఇతర సభ్యులు అడిగిన వివిధ ప్రశ్నలకు సొసైటీ అధ్యక్షులు గడప రమేష్ బాబు, ప్రధాన కార్యదర్శి రాము బొందుగుల కోశాధికారి నంగునూరి వెంకట రమణ వివరణ ఇచ్చారు. ఈ సమావేశానికి మోడరేటర్‌గా ప్రధాన కార్యదర్శి రాము బొందుగుల వ్యవహరించారు. 2024–2025 ఆర్థిక సంవత్సరానికి గానూ పద్దుల తనిఖీ దారులుగా సేవలు అందించిన కైలాసపు కిరణ్, తెల్లదేవరపల్లి కిషన్ రావు గార్లకు కృతజ్ఞతలు తెలియజేశారు. సొసైటీ రాజ్యాంగానికి ప్రతిపాదించిన కొన్ని ముఖ్యమైన సవరణలకు సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదం తెలియజేశారు. 2025 నుంచి 2026 గాను పద్దుల తనిఖీ దారులుగా నీలం సుఖేందర్, కిరణ్ కుమార్ ఎర్రబోయిన గార్లను ప్రతిపాదించి ఎన్నుకోవడం జరిగింది. ఈ సమావేశంలో సభ్యులు ఇచ్చిన సలహాలన్నింటిని స్వీకరించి అమలు చేయుటకు సాయశక్తుల ప్రయత్నిస్తామని కార్యవర్గ సభ్యులు తెలిపారు. చివరిగా సర్వ సభ్యులందరూ సొసైటీ ఏర్పాటు చేసిన హై టీ ని ఆస్వాదించారు. ఈ సమావేశంలో అధ్యక్షులు గడప రమేష్ బాబు, ప్రధాన కార్యదర్శి రాము బొందుగుల కోశాధికారి



నంగునూరి వెంకటరమణ, సొసైటీ ఉపాధ్యక్షులు బసిక ప్రశాంత్ రెడ్డి, దుర్గ ప్రసాద్, భాస్కర్ గుప్త నల్ల, జూలూరి సంతోష్ కుమార్ ఉపాధ్యక్షురాలు మిర్యాల సునీత రెడ్డి, సంస్థాగత కార్యదర్శి కాసర్ల శ్రీనివాస రావు, ప్రాంతీయ కార్యదర్శులు బొడ్ల రోజా రమణి, నడికట్ల భాస్కర్, శశిధర్ రెడ్డి, రవి కృష్ణ విజాపూర్,సంతోష్ వర్మ మాదారపు కార్యవర్గ సభ్యులు శివ ప్రసాద్ ఆవుల, పెరుకు శివ రామ్ ప్రసాద్, రవి చైతన్య మైసా, భాస్కర్ రావు పులిగిళ్ల, విజయ మోహన్ వెంగళ, ప్రవీణ్ మామిడాల, సతీష్ పెసరు, మణికంఠ రెడ్డి, రావుల సుగుణాకర్ రెడ్డి, చల్ల కృష్ణ గార్ల తోపాటు ఇతర జీవితకాల సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సొసైటీ వెన్నంటే ఉంటూ సహాయ సహకారాలు అందిస్తున్న ప్రతి ఒక్కరికి, సమావేశం సజావుగా సాగడానికి సహకరించిన సభ్యులందరికి పేరు పేరున ధన్యవాదాలు తెలిపారు.

# ఫాల్కన్ ఇన్వాయిస్ కేసు.. పంజాబ్‌లో సంస్థ సీవోవో అరెస్ట్

**హైదరాబాద్:** ఫాల్కన్ ఇన్వాయిస్ డిస్కౌంటింగ్ కేసులో మరొకరు అరెస్టయ్యారు. ఆ సంస్థ సీవోవో ఆర్యన్‌సింగ్‌ను సీఐడీ అధికారులు పంజాబ్‌లోని భటిండాలో అరెస్ట్ చేశారు. ఈ కేసులో ఆర్యన్ సింగ్ ఏ5గా ఉన్నాడు. ఫాల్కన్ ఇన్వాయిస్ సంస్థ పెట్టుబడుల పేరిట ప్రజల నుంచి భారీగా డిపాజిట్లు సేకరించింది. మొత్తం 7,056 మంది నుంచి రూ. 4,215 కోట్లు స్వీకరించింది. మోసం బయటపడటంతో పోలీసు కేసు నమోదైంది. ఆ తర్వాత సీఐడీ దర్యాప్తు చేపట్టింది. ఇప్పటి వరకు ఈ కేసులో 9 మంది చిక్కారు. దేశవ్యాప్తంగా ఉన్నా హైదరాబాద్ కేంద్రంగానే నిందితులు ఫాల్కన్ ఇన్‌వాయిస్ మోసానికి తెరలేపారు. ఈ కేసులో సైబరాబాద్ ఈవోడబ్ల్యూ పోలీసులు 19 మంది పేర్లను ఎఫ్ఐఆర్‌లో చేర్చారు. ప్రస్తుతం కేసును సీఐడీ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. బాధితుల నుంచి కొల్లగొట్టిన డబ్బును దాదాపు 20 డొల్ల కంపెనీలకు మళ్లించగా.. ఇందులో విదేశాలకు చెందిన సంస్థలు కూడా ఉన్నట్లు దర్యాప్తులో తేలింది.




## అన్ని వర్గాలను వంచించిన చరిత్ర భాజపాది.

**హైదరాబాద్:** తెలంగాణ భాజపా అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాయడంపై మంత్రి పొన్నం ప్రభాకర్ ఫైర్ అయ్యారు. మోదీ సర్కార్ ఫెయిల్యూర్స్ సంగతేంటని ప్రశ్నించారు. "11ఏళ్ల క్రితం కేంద్రంలో అధికారంలోకి వచ్చిన భాజపా దేశ ప్రజలను అడుగడుగునా వంచించింది. గత 3 ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రధాని విస్మరించి ప్రజల ఆశలపై నీళ్లు చల్లారు. వాగ్దానాలతో ఊదరగొట్టడం, విద్వేషాన్ని రెచ్చగొట్టడం, అబద్ధాలను ఆవిష్కరించడం తప్ప మీరు చేసిందేమీ లేదు. రైతులు, యువకులు, మహిళలు, పేదలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ.. ఇలా అన్ని వర్గాలను వంచించిన చరిత్ర మీది. మీ వైఫల్యాలు రాస్తే రామాయణమంత.. వింటే భారతమంత. అలాంటి మీరు మా ముఖ్యమంత్రికి లేఖలు రాయడం విడ్డూరంగా ఉంది. గురువింద గింజ సామెతను గుర్తు చేసే విధంగా ఉన్న మీ లేఖ నవ్వు తెప్పిస్తోంది. తెలంగాణకు 11 ఏళ్లలో ఏం చేశారు? తెలంగాణకు కేంద్రం ఒక్క రూపాయి ఇవ్వనప్పుడు మీరు కానీ, ఈ రాష్ట్రంలో ఉన్న 8 మంది భాజపా ఎంపీలు, ఇద్దరు కేంద్రమంత్రులు ఏం చేశారు? కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని 10లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తామని పదేళ్ల క్రితం ఇచ్చిన హామీ ఏమైంది? పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతలకి జాతీయ హోదా ఇవ్వకుండా మీనమేషాలు లెక్కిస్తోంది మీరు కాదా? పోలవరం ముంపుతో సంబంధం లేని 5 పంచాయతీలను ఏపీలో విలీనం చేసి భద్రాద్రి రామయ్య భూములను ఏపీకి అప్పనంగా అప్పగించింది మీరు కాదా?" అని పొన్నం ప్రభాకర్ ప్రశ్నించారు.

## కాంగ్రెస్ ప్రభుత్వంతోనే పేదల సొంతింటి కల సాకారం



-మొదటిపేజీ తరువాయి

పాలనలో పేదల కోసం ఎటువంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేదని భట్టి విక్రమార్క విమర్శించారు. రైతుభరోసా కోసం కాంగ్రెస్ ప్రభుత్వం రూ.17,500 కోట్లు చెల్లించిదని చెప్పారు. రూ.లక్ష కోట్లతో డ్వాక్రా మహిళలకు రుణాలు అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. అనంతరం మధిర పట్టణ ప్రగతిలో మరో కీలక మైలు రాయిగా నిలిచే రూ.6.45 కోట్లతో చేపట్టిన మధిరలోని అంబారుపేట పెద్ద చెరువు ట్యాంక్ బండ్ అభివృద్ధి పనులకు భట్టి విక్రమార్క శంకుస్థాపన చేశారు.

## రైతు భరోసా లేదు.. రైతు రుణమాఫీ లేదు

-మొదటిపేజీ తరువాయి

ఎందుకుందని కేటీఆర్ ప్రశ్నించారు. రాష్ట్రవ్యాప్తంగా 1.94 లక్షల మెట్రిక్ టన్నుల లోటు ఎందుకుందో రైతులకు వివరించాలని డిమాండ్ చేశారు. ?266.50 ఉండాల్సిన బస్తా యూరియా ధర ఇప్పుడు 325 ఎలా అయ్యిందో రైతులకే కాదు రాష్ట్ర ప్రజలకు మొత్తం తెలియాలన్నారు. ఈ బ్లాక్ మార్కెట్ దందాను దగ్గరుండి నడిపిస్తుంది ఎవరని ప్రశ్నించారు. ఈ కృత్రిమ కొరత ఎవరి వల్ల ఏర్పడుతుందో, ఆఖరికి ఎరువులను కూడా బుక్కేస్తున్న మేతన్నలు ఎవరో వెంటనే విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

## సిగాచి ఇండస్ట్రీస్ పేలుడు ఘటనలో 41కి చేరిన మృతులు.. ఇంకా దొరకని 9 మంది ఆచూకీ

సంగారెడ్డి: పాశమైలారం పారిశ్రామిక వాడలోని సిగాచి ఇండస్ట్రీస్ పేలుడు ఘటనలో మరొకరు చనిపోయారు. పటాన్‌చెరు ధృవ దవాఖానలో చికిత్స పొందుతున్న జితేందర్ అనే కార్మికుడు మృతిచెందారు. దీంతో మృతుల సంఖ్య 41కి చేరింది. ఈ ఘటనలో మరో తొమ్మిది మంది ఆచూకీ తెలియాల్సి ఉన్నది. పేలుడు ధాటికి కార్మికుల శరీర భాగాలు ఛిద్రమవై పరిశ్రమలోని యంత్రాలకు అతుక్కుపోయాయి. దీంతో తమవారి ఆచూకీ కోసం కార్మికుల కుటుంబ సభ్యులు సిగాచీ ఇండస్ట్రీస్ వద్ద పడిగాలు గాస్తున్నారు. ప్రమాదం సంభవించి ఏడు రోజులైనా కార్మికులను గుర్తించడంలో ఎలాంటి పురోగతి లేదంటూ కార్మిక సంఘాలు ఆందోళనకు దిగాయి. ప్రమాద స్థలాన్ని పరిశీలించడానికి వెళ్తున్న కార్మిక సంఘాల నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. కాగా, సిగాచి పరిశ్రమ పేలుడు ఘటనలో తీవ్రంగా గాయపడి ధృవ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న 9 మందిలో ఇప్పటికే ముగ్గురు మృతిచెందారు. మిగిలిన ఆరుగురిలో ముగ్గురు 40 నుంచి 80 శాతానికిపైగా కాలిన గాయాలతో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నారు. అయితే శుక్రవారం భీం రావు అనే కార్మికుడు మృతిచెందగా, శనివారం మరో కార్మికుడు మున్‌మున్ చౌదరి చనిపోయారు. తాజాగా మరో కార్మికుడు మరణించడంతో మరణాల సంఖ్య 41కి పెరిగింది.

## ప్రతి మంగళవారం జాతరే!

జగిత్యాల జిల్లా: మంగళవారం వస్తే చాలు.. ఆ ఆలయంలో భక్తుల సందడి ఉంటుంది. ఆ రోజు జరిగే జాతరకు భక్తజనకోటి తరలి వస్తుంది. ఆ విశిష్ట ఆలయం మెట్‌పల్లి మండలం వెల్లుల గ్రామంలో ఉంది. ఇక్కడి ఎల్లమ్మ తల్లి ఆలయం వద్ద ప్రతి మంగళవారం జరిగే జాతరకు విశేషంగా భక్తులు తరలి వస్తున్నారు. గ్రామ శివారులో రహదారి పక్కనే చెట్టు రూపంలో ఉన్న ఈ ఆలయానికి.. ఇటీవలి కాలంలో భక్తుల తాకిడి పెరిగింది. ప్రతి మంగళవారం ఇక్కడ జాతర జరగడం విశేషం. ఇక్కడి ఎల్లమ్మకు ఎన్నో మహిమలు ఉన్నాయని భక్తులు విశ్వసిస్తుంటారు. ప్రతి వారం జరిగే జాతరకు చుట్టు పక్కల గ్రామాల నుంచే కాకుండా.. ఇతర జిల్లాలు, మహారాష్ట్ర నుంచి భక్తులు భారీగా తరలివస్తున్నారు.

**సుమారు 300 ఏళ్ల క్రితం..**

ఎక్కడైనా ఆలయంలో దేవుడు, దేవత ఉండడం.. భక్తులు పూజిస్తుండటం సహజం. కానీ ఇక్కడ చెట్టునే దైవంగా భావించి పూజలు చేస్తున్నారు. మెట్‌పల్లి మండలం వెల్లుల గ్రామ శివారులోని ఒక చెట్టు కింద.. సుమారు 300 ఏళ్ల క్రితం ఎల్లమ్మ తల్లి వెలసింది. ప్రసిద్ధిగాంచిన ఈ ఆలయం వద్ద ప్రతి మంగళవారం జాతర జరుగుతోంది. ప్రతి వారం జరిగే జాతర సందర్భంగా మొక్కులు చెల్లించుకునేందుకు భక్తులు భారీగా తరలి వస్తున్నారు. చుట్టుపక్కల గ్రామాల నుంచే కాకుండా వివిధ జిల్లాలు, మహారాష్ట్ర నుంచి తరలి వస్తున్నారు. అమ్మవారికి బెల్లం, పుట్నాలు, కల్లు సమర్పించి కోళ్లు, పొట్టేళ్లను బలిస్తున్నారు. కుటుంబ సమేతంగా వంటలు చేసుకొని సహపంక్తి భోజనం చేస్తున్నారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చే జనాలతో ఈ ప్రాంతమంతా ప్రతి మంగళవారం సందడిగా మారుతుంది.

**బావినీటితో స్నానం ఆరోగ్యకరం**

ఎల్లమ్మ ఆలయానికి వచ్చే భక్తులు అక్కడి బావి నీటితో స్నానం చేస్తారు. ఈ బావిలోని నీటితో స్నానం చేస్తే చర్మవ్యాధులు తొలగిపోతాయని నమ్మకం. పురాతన కాలం నుంచి వస్తున్న ఈ ఆచారాన్ని ఇప్పటికీ కొనసాగిస్తున్నారు. అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్న తర్వాత.. తిరిగి ఇంటికి వెళ్లే సమయంలో భక్తులు బావిలోని నీటిని వెంట తీసుకెళ్తారు. పంటలు వేసే ముందు అమ్మవారిని దర్శించుకొని వెళ్తే బాగా పండుతాయని రైతులు నమ్ముతుంటారు.

# సంపాదకీయం

## మూడో అతిపెద్ద ఎకానమీ దేశంగా భారత్

ప్రపంచవ్యాప్తంగా యుద్ధ మేఘాలు కమ్ముకున్నా, ప్రతికూల పరిస్థితులు ఎదురైనా భారత్ మాత్రం జీడీపీలో దూసుకెళ్తోంది. అగ్రదేశాల జీడీపీ ఎలా ఉన్నా భారత ఆర్థిక వ్యవస్థ పరుగులు పెడుతోందని ప్రపంచ సంస్థలే చెబుతున్నాయి. ఇటీవలే జపాన్ ను అధిగమించి ప్రపంచంలోనే నాలుగవ ఆర్థిక వ్యవస్థగా ఇండియా అవతరించింది. 2030 నాటికి జర్మనీని సైతం అధిగమించి మూడో అతిపెద్ద ఎకానమీ దేశంగా భారత్ నిలుస్తుందని కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరీ అన్నారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా 77వ ఫౌండేషన్ డే వేడుకల్లో ఆయన ప్రసంగించారు. గత 11 ఏళ్లలో మన దేశ జీడీపీ డబుల్ అయ్యిందని చెప్పారు. 2014లో దేశ జీడీపీ 2.1 ట్రిలియన్ డాలర్లుగా ఉంటే 2025లో అది 4.3ట్రిలియన్ డాలర్లకు చేరుకుందని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రతికూల పరిస్థితులు నెలకొన్నప్పటికీ.. మోడీ చేపట్టిన సంస్కరణల వల్లే ఇది సాధ్యమైందన్నారు. పేదల అభ్యున్నతి కోసం మోడీ ఎన్నో పథకాలు తీసుకొచ్చినట్లు తెలిపారు.మోడీ స్కీమ్ లతో 27 కోట్ల మంది ప్రజలు పేదరికం నుంచి బయటపడ్డారని హర్దీప్ సింగ్ పూరీ అన్నారు. ప్రధాన మంత్రి అవాస్ యోజన కింద 4 కోట్ల మందికి ఇళ్లు మంజూరు చేసినట్లు చెప్పారు. అదేవిధంగా 15.4 కోట్ల మందికి నల్లా కనెక్షన్ల ద్వారా తాగు నీరు అందిస్తున్నామని తెలిపారు. ఆయుష్మాన్ భారత్ స్కిమ్ తో 70కోట్ల మందికి రూ.5లక్షల బీమా అందిస్తున్నామన్నారు. ఇవన్నీ దేశాభివృద్ధికి మోడీ ప్రభుత్వ నిబద్ధతకు అద్దం పడుతున్నాయని చెప్పారు.అంతేకాకుండా విదేశీ పెట్టుబడులను సాధించడంలో భారత్ సక్సెస్ అయ్యిందని పూరీ అన్నారు. ఇది గత దశాబ్దంతో పోలిస్తే 143శాతం పెరిగిందన్నారు. వార్షిక ఆదాయపు పన్ను రిటర్న్‌లు 2013-14 ఆర్థిక సంవత్సరంలో 3.6 కోట్లుగా ఉంటే.. 2024-25 ఆర్థిక ఏడాదిలో 8.5 కోట్లకు పెరిగాయని తెలిపారు. భవిష్యత్ ను దృష్టిలో ఉంచుకుని ఏఐ సాంకేతికతను వాడుకుంటూ చార్టెడ్ అకౌంటెంట్స్ ముందుకు సాగాలని సూచించారు. అభివృద్ధి చెందుతున్న ఆర్థిక ప్రపంచంలో అగ్రస్థానంలో నిలవాలంటే ఇది చాలా అవసరమని హర్దీప్ సింగ్ పూరీ నొక్కి చెప్పారు. 2030 నాటికి భారత్ మరింత బలమైన ఆర్థిక వ్యవస్థగా ఎదగనుంది. ఎస్ అండ్ పీ గ్లోబల్ మార్కెట్ ఇంటెలిజెన్స్ ఈ విషయాన్ని తెలిపింది. 2030 నాటికి 7.3 లక్షల కోట్ల డాలర్ల జీడీపీతో ప్రపంచంలోనే మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ ఎదగనుందని తెలిపింది. జపాన్‌ను వెనక్కి నెట్టి ఆసియాలో అదిపెద్ద రెండో ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరించనుందని హెచ్ఎస్‌బీసీ గ్లోబల్ ఇండియా మ్యానుఫ్యాక్చరింగ్ తన తాజా పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ తన నివేదికలో తెలిపింది. ఇదిలా ఉంటే 2021, 2022లో వేగవంతమైన ఆర్థిక వృద్ధి తర్వాత, భారత ఆర్థిక వ్యవస్థ 2023 ఆర్థిక సంవత్సరంలో బలమైన వృద్ధిని చూపుతూనే ఉంది.హెచ్ఎస్‌బీసీ గ్లోబల్ ఇండియా మ్యానుఫ్యాక్చరింగ్ అంచనా ప్రకారం 2024 ఆర్థిక సంవత్సరంలో జీడీపీ 6.2 నుంచి 6,3 శాతం పెరగనుందని చెబుతోంది. దీంతో భారత ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా అవతరించనుంది. ఆసియాలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ వృద్ధి రేటు ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో 7.8 శాతంగా ఉంది. ఈ లెక్కన ఆర్థిక వ్యవస్థ ఇలాగే వృద్ధిలో కొనసాగితే.. భారత్ రెండో స్థానంలోకి రావడం ఖాయంగా తెలుస్తోంది. దేశీయంగా డిమాండ్‌లో బలమైన వృద్ధి కనిపిస్తుండడం సానుకూల అంశమని ఎస్ అండ్ పీ చెబుతోంది.ఇదిలా ఉంటే ప్రస్తుతం ప్రపంచంలో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగల దేశంగా అమెరికా అగ్ర స్థానంలో ఉన్న విషయం తెలిసిందే. ఆ తర్వాత చైనా రెండో స్థానంలో ఉండగా, మూడో స్థానంలో జపాన్ ఉంది. అయితే ప్రస్తుతం భారత్‌లో కనిపిస్తున్న వృద్ధి ఇలాగే కొనసాగితే 2030 నాటికి భారతదేశ జీడీపీ జర్మనీని అధిగమిస్తుందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇక 2039 నాటికి భారత్‌లో 110 కోట్ల మంది భారతీయులకు ఇంటర్‌నెట్ లభించనుందని, 5జీ నెట్‌వర్క్ అందుబాటులోకి రాకవడంతో దేశంలో ఇ-కామర్స్ గణనీయంగా 4జీ నుంచి 5జీ సాంకేతికతకు మారడంతో ఇ-కామర్స్ గణనీయంగా వృద్ధి చెందనుంది.. ఈ ఏడాది వృద్ధికి... బలమైన దేశీయ గిరాకీ, తయారీ, సేవల రంగాల నుంచి మద్దతు లభిస్తుందని పేర్కొంది. చైనాలో ప్రభుత్వ మౌలిక సదుపాయాల పెట్టుబడులు, ప్రైవేట్ పెట్టుబడుల కొరతను పాక్షికంగా భర్తీ చేస్తున్నాయని వివరించింది. అయితే స్థిరాస్తి రంగంలోని సవాళ్ల వల్ల ఆ దేశ ఆర్థిక వ్యవస్థలో ఎదురు గాలులు వీస్తున్నాయని ఐరాస నివేదిక స్పష్టం చేసింది. భారత్‌లో మాత్రం ప్రభుత్వ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు,బహుళజాతి కంపెనీల పెట్టుబడుల్లో గణనీయంగా వృద్ధి నమోదైందని గుర్తుచేసింది. ఆర్థిక కార్యకలాపాల తీరును తెలియజేసే..మాన్యుఫ్యాక్చరింగ్ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్-ఖఓఎ2023 మూడో త్రైమాసికంలో ఒక్క భారత్ మినహా ప్రపంచంలోని అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలన్నింటిలో క్షీణించిందని వెల్లడించింది. అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థల కంటే అభివృద్ధి చెందుతున్న దేశాల్లోనే పెట్టుబడులు బలంగా ఉన్నాయని పేర్కొంది. భారత్‌లో 2023లో పెట్టుబడుల సెంటిమెంట్.బలంగానే ఉందని తెలిపింది. అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థలు తమ సరఫరా గొలుసులను మారుస్తుండడంవల్ల అనేక దేశాలు భారత్‌ను ప్రత్యామ్నాయ తయారీ కేంద్రంగా చూస్తున్నాయని ఐరాస నివేదిక విశదీకరించింది. ఇది భారత్‌కు కలిసొస్తోందని విశ్లేషించింది. 2023లో ప్రకృతి విపత్తులు దక్షిణాసియా ప్రాంతాన్ని ప్రభావితం చేశాయన్న ఐరాస నివేదిక జులై, ఆగస్టులో భారత్, నేపాల్., బంగ్లాదేశ్‌లో చాలాప్రాంతాలు అనావృష్టిని ఎదుర్కొన్నాయని తెలిపింది. భారత్‌లో ఆగస్టు నెలలో గత నాలుగు దశాబ్దాల్లోనే అత్యంత తక్కువ వర్షపాతం నమోదైందని, ఈ కారణంగా ప్రధాన పంటల ఉత్పత్తిపై ప్రతికూల ప్రభావం పడిందని గుర్తుచేసింది. ఈ పరిణామాలు వృద్ధిరేటుపై కొంత ప్రభావం చూపాయని తెలిపింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో కొనసాగుతున్న అనిశ్చితి నేపథ్యంలో జీడీపీ? వృద్ధి 2023లో 2.7 శాతం నుంచి 2024లో 2.4 శాతానికి తగ్గుతుందని అంచనా వేసింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు 2023లో మాంద్యం ముప్పు తప్పినప్పటికీ దీర్ఘకాలం తక్కువ వృద్ధిరేటుతో సరిపెట్టుకోవాల్సి రావచ్చని అంచనా వేసింది

# మహోన్నత పార్లమెంటేరియన్



భారత దేశ చరిత్రలో ప్రత్యేక గుర్తింపు పొందిన నేత జగ్జీవన్ రామ్. అతి చిన్న వయస్సులో (27 ఏళ్లకే) శాసనమండలి సభ్యుడిగా ఎన్నికయ్యి రికార్డు సృష్టించిన ప్రజానాయకుడు, స్వాతంత్ర్య సమర యోధుడు, బాబూ జగ్జీవన్ రాం. పొలిటికల్ కింగ్ మేకర్‌గా రాజకీయంలో రాణించి, అధికారం కోసం కాకుండా ప్రజా శ్రేయస్సు కోసమే పనే చేసిన మహోన్నత వ్యక్తిత్వం ఆయన సొంతం. యాభై ఏళ్ళు పార్లమెంట్‌లో సభ్యునిగా కొనసాగిన సుదీర్ఘ రాజకీయ చరిత్ర ఆయనది. 1908 ఏప్రిల్ 5న బీహార్ రాష్ట్రం, షాబాద్ జిల్లా, ఛాందా గ్రామంలో శిబిరం, బసంతి దేవి దంపతులకు జగ్జీవన్ జన్మించారు. ఆయన ఒక పేద దళిత కుటుంబంలో జన్మించడంతో ఎన్నో అవమానాలను, ఛీత్కారలను ఎదుర్కొన్నారు. చిన్ననాడే తండ్రి చనిపోవడంతో సాంఘిక, ఆర్థిక ఇక్కట్ల మధ్య తల్లి వసంతీదేవి సంరక్షణలో తన చదువు కొనసాగించారు. రాత్రింబవళ్ళు భోజ్‌పురితో పాటు హిందీ, ఇంగ్లీషు, బెంగాలి, సంస్కృత భాషల్లో ప్రావీణ్యం సంపాదించారు. బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో ఇంటర్, కలకత్తా విశ్వ విద్యాయం నుంచి డిస్టింక్షన్‌లో బిఎస్సీ డిగ్రీ పూర్తి చేసి పట్టభద్రు డయ్యారు. పీజీ చదువు పూర్తి చేశారు. కార్మికుల కోసం పొరాడి 35వేల మంది కార్మికులతో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించి, సుభాష్ చంద్రబోస్, చంద్రశేఖర్ ఆజాద్ వంటి అనేకమంది జాతీయ నాయకుల దృష్టిలో పడ్డారు.ఆయన జీవితకాలం 78 ఏళ్ళు అయితే అందులో 52 ఏళ్ళు రాజకీయ జీవితం గడిపారు.1952లో భారత రిపబ్లిక్ తొలి లోక్‌సభ ప్రవేశించిన జగ్జీవన్‌రామ్ వరుసగా ఎనిమిది సార్లు గెలిచారు. ఏకధాటిగా 33 సంవత్సరాలు కేంద్రమంత్రిగా, దేశ ఉప ప్రధానిగా ఆయన ప్రత్యేకత చాటుకున్నారు. మొదటి శ్రేణి పార్లమెంట్ రియన్‌గా నిలిచారు. మంత్రి మండలిలో అతి చిన్న వయసుడ్కైన జగ్జీవన్‌రామ్‌ను అందరూ 'బేబి మినిష్టర్' అని పిలిచేవారు. ప్రజలంతా ప్రేమతో 'బాబుజీ' అని పిలిచేవారు.వ్యవసాయ శాఖ మంత్రిగా, ఆహార శాఖ మంత్రిగా, రైల్వే మంత్రిగా, రక్షణ శాఖ మంత్రిగా, ఉప ప్రధానిగా ఎన్నో సేవలనందించిన ప్రగతిశీలి ఆయన. దామోదరం సంజీవయ్యను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చెయ్యటంలో కీలకపాత్ర పోషించారు. 1942లో కాంగ్రెస్ లో చేరి, జగ్జీవన్ 1969లో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. 1977లో ఇందిరా గాంధీతో విభేదించి పార్టీ నుంచి బయటకు వచ్చి 'ప్రజాస్వామ్య కాంగ్రెస్' పార్టీ ఏర్పాటు చేశారు.ఇంద్రాణిదేవితో బాబుజీకి 1935 జూన్ 1న వివాహం జరిగింది. ఇంద్రాణి కూడా స్వాతంత్ర్య సమరయోధురాలు. ఆయన కుమార్తె మీరాకుమార్ తండ్రి ఆదర్శాలతోనే పెరిగి, ఆయన బాటలోనే కేంద్రమంత్రిగా, లోక్‌సభ స్పీకర్‌గా దేశానికి సేవలందించారు.బాబుజీ గొప్ప రచయిత అన్న సంగతి చాలా మందికి తెలియదు. ఆయన హిందీలో, ఇంగ్లీషులో రచనలు చేశారు. "భారత దేశంలో కులం సవాళ్ళు", " జీవన సరళి వ్యక్తిత్వ వికాసం" అను రెండు విశిష్ట గ్రంథాలను రాశారు. ఆయన గొప్ప అధ్యయనశీలి. ఉజ్జయినిలోని విక్రమ విశ్వ విద్యాయం 1967లో జగ్జీవన్‌రామ్ కు 'డాక్టర్ ఆఫ్ సైన్స్' గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఆయన సేవను మెచ్చిన కాన్పూర్ విశ్వవిద్యాయం 1968లో డాక్టరేట్‌తో సత్కరించింది. జగ్జీవన్ రామ్ అమూల్యరత్నం" అని గాంధీ ఒక సందర్భంలో రాశారు. 1986 జూల్కై 6వ తేదీన బాబూజీ తన తుదిశ్వాస విడిచారు. బాబు జగ్జీవన్ రామ్ వరుసగా ప్రజాప్రతినిధిగా, భారత దేశంలో ఎక్కువ కాలం పనిచేసిన క్యాబినెట్ మంత్రిగా రికార్డు సృష్టించారు. ఆయన కేంద్ర కార్మిక మంత్రిగా 1946 నుండి 1952 సంవత్సరం వరకు ఉన్నారు. ఆయన 1952 నుండి 1956 సంవత్సరం వరకు కేంద్ర సమాచార శాఖ మంత్రిగా ఉన్నారు.1956 నుండి 1962 వరకు కేంద్ర రవాణా, రైల్వే శాఖ మంత్రిగా పనిచేశారు.1962 నుండి 1963 సంవత్సరం వరకు ఆయన కేంద్ర రవాణా మరియు సమాచార శాఖ మంత్రిగా ఉన్నారు. 1966 నుండి 1967 సంవత్సరం వరకు కేంద్ర కార్మిక, ఉపాధి మరియు పునరావాస శాఖ మంత్రిగా పని చేశారు. 1967 నుండి 1970 వరకు కేంద్ర ఆహార, వ్యవసాయ శాఖ మంత్రిగా ఉన్నారు. 1970-1974, 1977 - 1979 కేంద్ర రక్షణ మంత్రిగా ఉన్నారు.1974 నుండి 1977 వరకు కేంద్ర వ్యవసాయ, నీటిపారుదల శాఖ మంత్రిగా ఉన్నారు. సెప్టెంబర్ 1976 నుండి 1983 ఏప్రిల్ వరకు భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ అధ్యక్షుడిగా పని చేశారు. భారత ఉప ప్రధాన మంత్రిగా, 1977 మార్చి 24 నుండి 1979 జూలై 28 వరకు విధులు నిర్వర్తించారు.

# జునోటిక్ వ్యాధులతో జర జాగ్రత్త !



అనాదిగా మనిషికి, పశుపక్ష్యాదులకు మధ్య అవిభాజ్య సంబంధం బలపడింది. గ్రామీణ వ్యవసాయ కుటుంబంలో ఎడ్లు, బర్రెలు, మేకలు, గొర్రెలు, కోళ్లు, కుక్కలు, పిల్లులు, బాతులు, పక్షులు, గుర్రాలు, పందులు, కుందేళ్లు మొదలైన పెంపుడు జంతువులు భాగమై ఉంటాయి. ఈ పెంపుడు జంతువులతో మానవులు ప్రేమను పంచుకుంటూ, వాటిని కుటుంబ సభ్యులుగా భావిస్తూ, వాటి ఆలనాపాలనా చూసుకుంటూ, ఎత్తుకొని ముద్దు చేస్తూ, భుజాన వేసుకొని తిరుగుతూ ఉంటారు. ఇలాంటి సాదు జంతువులు వ్యాధికారక సూక్ష్మజీవులైన బ్యాక్టీరియా, వైరస్, ఫంగీ, పరాన్నజీవులతో ఇన్ఫెక్ట్ అయితే ఆయా జంతువుల నుంచి మానవులకు కొన్ని ప్రమాదకర వ్యాధులు సంక్రమిస్తాయి. ఈ విధంగా జంతువుల నుంచి మనుషులకు (జునోటిక్) లేదా మనుషుల నుంచి జంతువులకు సంక్రమించే (రివర్స్ జునోటిక్) వ్యాధులను "జునోటిక్ వ్యాధులు"గా పిలుస్తాం. దాదాపు 130 రకాల సూక్ష్మజీవులు, 60 వరకు పరాన్నజీవుల వల్ల దాదాపు 250 రకాల జునోటిక్ వ్యాధులు సోకుతాయని వెల్లడయ్యింది. . ప్రంచవ్యాప్తంగా 114కు పైగా దేశాల్లో జునేటిక్ వ్యాధుల బెడద అధికంగా నమోదు అవుతున్నాయి. ప్రతి 10 వ్యాధుల్లో 6 జునోటిక్ సంబంధ వ్యాధులే ఉన్నాయని తెలుస్తున్నది. జునోటిక్ వ్యాధుల పట్ల సంపూర్ణ అవగాహన, నివారణ చర్యలు, తీసుకోవలసిన జాగ్రత్తలను చర్చించే వేదికలుగా ప్రతి ఏట 06 జూలై రోజున "ప్రపంచ జునోసిస్ దినం (వరల్డ్ జునోసిస్ డే)" పాటించనట ఆనవాయితీగా మారింది. 06 జూలై 1885 రోజున "లూయీ పాశ్చర్" అను ప్రఖ్యాత శాస్త్రజ్ఞుడు తొలిసారి పిచ్చి కుక్క కరిచిన వ్యక్తికి ఆంటీ రాబిస్ టీకా ఇవ్వడం జరిగింది. ఈ విప్లవాత్మకమైన ఘనతకు గుర్తుగా ప్రతి ఏట 06 జూలైన ప్రపంచ జునోసిస్ దినం పాటించడం పరిపాటి అయ్యింది. ప్రపంచ జునోసిస్ దినం-2025 ఇతివృత్తంగా "ఒకే ప్రపంచం, ఒకే ఆరోగ్యం : జునోటిక్ వ్యాధులను నిరోధించడం (వన్ వరల్డ్, వన్ హెల్త్ : ప్రివెంట్ జునోసిస్)" అను అంశాన్ని తీసుకున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ అధ్యయనం ప్రకారం 61 శాతం వ్యాధులు జునోటిక్ సంబంధమైనవే అని, దాదాపు 1400 వ్యాధికారక సుక్ష్మజీవులు లేదా పాథోజెన్స్ పలు రకాల జంతువులను ఇన్ఫెక్ట్ చేస్తాయని, గత దశాబ్ద కాలంలో కరోనా లాంటి 75 శాతం కొత్త జునోటిక్ వ్యాధులే ఉన్నాయని తేల్చారు. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 100 మిలియన్ల ప్రజలు సాదు జంతువులతో సహజీవనం చేస్తున్నారు. ఈగలు, దోమలు, పేలు, కీటకాలతో కూడా జునోటిక్ వ్యాధులు సంక్రమించవచ్చు. గతంలో మిలియన్ల ప్రజల మరణాలకు కారణం అయిన బొవైన్ టిబీ, బుబోనిక్ ప్లేగ్, గ్లార్స్, డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా లాంటి వ్యాధులు కూడా జునోటిక్ సంబంధమైనవా మాత్రమే అని తెలుసుకోవాలి. ప్రత్యక్షంగా వ్యాధికారక బ్యాక్టీరియా లేదా వైరస్ సోకిన పెంపుడు జంతువుల లాలాజలం, మూత్రం, మలం, రక్తం, శ్లేష్మం లాంటివని మనుషులు తాకినపుడు జునోటిక్ వ్యాధులు సోకుతాయి. పెంపుడు జంతువులను తాకినా, సమీపంలో గడిపినా, గోర్లతో గీకినా కూడా ఈ వ్యాధులు రావచ్చు. కలుషిత, పూర్తిగా ఉడకని ఆహారం (మాంసం, గుడ్లు, పాలు, జంతువులు ముట్టిన పండ్లు) తీసుకున్నపుడు కూడా ఈ వ్యాధులు రావచ్చు. పచ్చి పాలు తాగినా జునేచిక్ వ్యాధులు రావచ్చని, వ్యాధినిరోధక శక్తి తక్కువగా ఉన్న వ్యక్తులకు కూడా జునోటిక్ వ్యాధులు సులభంగా సోకుతాయి. భారత్‌లో జునోటిక్ వ్యాధుల బెడద అధికంగా కనిపిస్తున్నది. సాదు జంతువులు, జంతు ప్రయోగశాలలు, వ్యాధి నిర్ధారణ కేంద్రాలు, పశు వైద్యులు, చర్మం/తోళ్ళ పరిశ్రమలు, ధాన్య గిడ్డంగులు జునోటిక్ వ్యాధులకు కారణాలుగా నిలుస్తున్నాయని హెచ్చరిస్తున్నారు. పాడి పంటలు, సాదు జంతువులే జీవనోపాధులుగా గడుపుతున్న పేద కుటుంబాలకు జునోటిక్ వ్యాధుల సమస్యలు అధికంగా ఉంటున్నాయి. జునోటిక్ వ్యాధులు సోకకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి. జంతువులను తాకిన ప్రతిసారా చేతులను శుభ్రంగా సబ్బుతో కడుక్కోవాలి. దోమలు, ఈగలు లాంటివని రాకుండా జాగ్రత్త పడాలి. పచ్చి పాలు తాగడం మానేయాలి. ఆహారాన్ని పూర్తిగా ఉడికించాలి. వంట సామాగ్రిని శుభ్రంగా కడగాలి. చనిపోయిన జంతువులను భూమిలో పాతి పెట్టాలి. జంతువులను తాకు సందర్భాల్లో మాస్కులు, చేతి గ్లౌజులు ధరించాలి. అధిక కాలం ఫ్రిజ్‌లో నిలువ ఉంచిన ఆహారాన్ని తీసుకోరాదు. పెంపుడు జంతువులకు క్రమం తప్పకుండా టీకాలు వేయించాలి. వీధి కుక్కలతో జాగ్రత్తగా ఉండాలి. జంతు మలమూత్రాలతో నీరు కలుషితం కాకుండా చూసుకోవాలి. త్రాగే నీటిని మరిగించి వాడాలి. గర్భిణులు, శిశువులు, వృద్ధులు, అవయవ మార్పిడి చేయించుకున్న వారు, మధుమేహం గల వారు, ఆల్కహాల్ సేవించే వారు జునోటిక్ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలి. పెంపుడు జంతువులతో జాగ్రత్తగా మసులుకుంటూ, జీవనోపాధులను పొందుతూ, జునోటిక్ వ్యాధులకు దూరంగా, ఆరోగ్యకర కుటుంబాలకు దగ్గరగా జీవిద్దాం, జంతు సంబంధ వ్యాధులను పొలిమేరలు దాటిద్దాం. .

## హైదరాబాదీ క్రికెట్ ఆల్ రౌండర్ జయసింహా

భారత దేశంలో క్రికెట్ అంతగా ప్రాచుర్యం పొందని రోజుల్లోనే స్టైలిష్ క్రికెటర్ గా తెరపైకి వచ్చిన సాటిలేని మేటి హైదరాబాదీ క్రికెట్ లెజెండ్ ఎం. ఎల్.జయసింహా. పదిహేనేళ్ల వయసులోనే హైదరాబాద్ జట్టు తరపున ఆంధ్రప్రదేశ్ జట్టుపై ఆడిన తొలి మ్యాచ్ లో తొంభై పరుగులు సాధించి, అందరి దృష్టినీ ఆకర్షించాడు. క్రికెట్ ప్రపంచంలో "కలివేటెడ్ స్టైలిస్ట్'గా గుర్తింపు పొందిన ఎం.ఎల్.జయసింహగా చిరపరిచితులైన మోటగానహళ్ళి లక్ష్మీనరసు జయసింహ సికింద్రాబాద్ లో 1939 మార్చి 3న జన్మించాడు. అయన చదువు సంధ్యలన్నీ ఇక్కడే సాగాయి, హైదరాబాద్ జట్టు తరపునే ఫస్ట్ క్లాస్ క్రికెట్ లో అరంగేట్రం చేశాడు. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్.... ఇలా అన్ని అంశాల్లోనూ రాణించి ఆల్ రౌండర్‌గా సత్తా చాటుకున్నాడు. క్రికెట్లో ఇప్పటి రికార్డులతో పోల్చి చూస్తే జయసింహ రికార్డులు పెద్దగా అనిపించక పోవచ్చు. అయితే, అప్పటి పరిస్థితుల్లో ఆయన సాధించిన రికార్డులు తక్కు వేమీ కాదు. అప్పట్లో ఆధునిక క్రికెట్ కోచింగ్ సౌకర్యాలు అంతంత మాత్రమే. ఇప్పటిలా అప్పట్లో క్రికెటర్లకు ఆకర్ష ఆకర్షణీయమైన ఆదాయావకాశాలు ఉండేవి కాదు. అలాంటి పరిస్థితుల్లో రాణించడం అంత తేలిక కాదు. ఫస్ట్ క్లాస్ క్రికెట్లో తొలి మ్యాచ్లోనే తొంభై పరుగులతో శుభారంభం చేసిన జయసింహ, ఆ తర్వాత మద్రాస్, మైసూరు జట్లతో ఆడిన మ్యాచ్లలో సెంచరీలు కొట్టాడు. అదే సీజన్లో రంజీ మ్యాచ్ లలో పౌలర్‌గా కూడా రాణించి, ఇరవై వికెట్లు తీసి, 1959లో ఇంగ్లండ్ కు వెళ్లిన భారత క్రికెట్ జట్టులో చోటు సంపాదించు కున్నాడు. లార్డ్స్ మైదానంలో తొలి అంతర్జాతీయ టెస్ట్ ఆడాడు. తొలి టెస్ట్ లో విఫలమైనా, ఆ తర్వాతి రెండు టెస్ట్ మ్యాచ్ లలోనూ రాణించి, క్రికెట్ అభిమానుల దృష్టిని ఆకర్షించాడు. ఒక టెస్ట్ మ్యాచ్ లో వరుసగా ఐదురోజులూ బ్యాటింగ్ చేసిన తొలి క్రికెటర్ గా జయసింహ ఘనత సాధించాడు. ప్రపంచంలో ఈ ఘనత సాధించిన తొలి క్రికెటర్ జయసింహ అయితే, ఈ ఘనత సాధించిన రెండో భారత క్రికెటర్ రవిశాస్త్రి. ఆస్ట్రేలియా జట్టుపై 1960లో కలకత్తాలో ఆడిన మ్యాచ్ లో జయసింహ తొలిరోజు ఆట ముగిసే సమయంలో బ్యాటింగ్ ప్రారంభించాడు. రెండో రోజు ఇరవై పరుగుల వద్ద ఉండగా, ఇన్నింగ్స్ డిక్లేర్ చేశారు. సెకండ్ ఇన్నింగ్స్ లో మూడో రోజు ఆట ముగిసే సమయానికి మళ్లీ బ్యాటింగ్ అవ కాశం వచ్చింది. నాలుగో రోజంతా బ్యాటింగ్ చేసి 59 పరుగులు చేశాడు. చివరిగా ఐదో రోజు 74 పరుగుల వద్ద ఔటయ్యాడు, రెండేళ్ల తర్వాత పాకిస్తాన్ జట్టుపై కాన్పూర్ లో ఆడిన టెస్ట్ మ్యాచ్ లో ఒక సింగిల్ రన్ కోసం తొందర పడి 99 పరుగుల వద్ద ఔటయ్యాడు. తొలి నాళ్లలో మిడిల్ ఆర్డర్ బ్యాట్స్ మన్ గా ఉన్న జయసింహ, క్రమంగా ఓపెనర్‌గా ఎదిగాడు. ఓపెనర్‌గానే ఇంగ్లాండ్, శ్రీలంక జట్లపై సెంచరీలు చేశాడు. వెస్ట్ ఇండీస్ పై 1970 - 71 లో చివరి టెస్ట్ సిరీస్ ఆడిన జయ సింహ, జూనియర్లకు మార్గదర్శిగా ఉండేవాడు. ఆటలో జయసింహ ఇచ్చిన సలహాలు విలువైనవని మాజీ కెప్టెన్ అజిత్ వాడేకర్ కొనియాడటమే ఇందుకు నిదర్శనం. మరో మాజీ కెప్టెన్ నవాబ్ మహమ్మద్ మన్సూర్ అలీఖాన్ పటౌడీ (టైగర్ పటౌడీ) సైతం జయసింహ నాయకత్వంలో పలు మ్యాచ్ లు ఆడాడు. 'లిటిల్ మాస్టర్ సునీల్ గవాస్కర్ బ్యాటింగ్ శైలిలో జయసింహనే గురువుగా పరిగణించేవాడు. క్రికెటర్ గా విరమించుకున్నాక కొన్నాళ్లు సెలెక్టర్ గా, శ్రీలంక పర్యటనలో భారత జట్టుకు మేనేజర్ గా వ్యవహరించాడు. కొన్నాళ్లు కామెంటేటర్ గానూ ఆటతో బాంధవ్యాన్ని కొనసాగించిన జయసింహ, 1999 జూలై 6న లంగ్ కేన్సర్ తో సైనిక్ పురిలోని తన నివాసంలో కన్ను మూశాడు. జయసింహ 39 టెస్టు మ్యాచులలో 2056 పరుగులు చేసి, 30.68 బ్యాటింగ్ సరాసరి సాధించాడు.3 సెంచరీలు, 12 అర్థ సెంచరీలు సాధించి, 129 అత్యధిక స్కోరు సాధించాడు. అలాగే 2097 బంతులు బౌలింగ్ చేసి, 92.11 బౌలింగ్ సరాసరితో 9 వికెట్లు సాధించాడు.

# ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా జరపాలి

**ఎమ్మార్పీఎస్ పాలకుర్తి మండల ఇన్చార్జి కొండల రాజేందర్ కుమార్ మాదిగ పిలుపు.**

**అగ్నిసార న్యూస్,( రామగుండం)** ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా జరపాలని ఎమ్మార్పీఎస్ పాలకుర్తి మండల ఇన్చార్జి కొండల రాజేందర్ కుమార్ మాదిగ పిలుపునిచ్చారు. ఆదివారం పాలకుర్తి మండల కేంద్రంలోనీ వివిధ గ్రామాల్లో కొండల రాజేందర్ కుమార్ మాదిగ ఎమ్మార్పీఎస్ అనుబంధ ఎం ఎస్ పి పెద్దపల్లి జిల్లా అధికార ప్రతినిధి పాలకుర్తి మండల ఇంచార్జి మండలలో గ్రామ కమిటీ లు వేస్తూ మాదిగల చైతన్య సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశాన్ని నిర్వహించిన అనంతరం జులై 7 జాతి జండా పండగలు ఘనంగా నిర్వహించాలని తెలిపారు. జాతిని నడిపించాం.. గెలిపించాం ఇగ సమాజాన్ని నడిపిద్దాం.. రాజకీయ చైతన్యాన్ని నింపుతూ అన్ని వర్గాల హక్కుల కోసం ఉద్యమిద్దాం.ఈ దేశ కుల వ్యవస్థలో అణగారిపోయిన కులాలన్ని ఏ కులానికి ఆ కులం సామాజిక చైతన్యమై అంతిమంగా మహాజన సమూహంగా అన్ని కులాలు ఏకం కావాల్సిన అవసరం ఉందని ఎమ్మార్పీఎస్ పాలకుర్తి మండల ఇంచార్జి కొండల రాజేందర్ కుమార్ మాదిగ అన్నారు. ఎమ్మార్పీఎస్ దిమ్మె కట్టడానికి రాజేందర్ కుమార్ మాదిగ వారితో కలిసి భూమి పూజ చేయడం జరిగింది ఎమ్మార్పీఎస్ ఉద్యమ ప్రభావం అన్ని అణగారిన కులాల్లో సామాజిక చైతన్యానికి రగిలించిందని అన్నారు. ప్రతి కులం తమ అస్తిత్వాన్ని చాటుకోవడానికి సంఘాల ఏర్పాటు చేసుకొని పోరాట బాటలోకి వచ్చాయని అన్నారు.వారికి కావాల్సినంత ప్రోత్సాహాన్ని సహకారాన్ని మందకృష్ణ మాదిగ అందించారు.



అందువల్ల ఎమ్మార్పీఎస్ ఉద్యమం కేవలం మాదిగల ప్రయోజనాల వరకే పరిమితం కాకుండా అన్ని అణగారిన కులాల సంక్షేమం కోసం కృషి చేసిందని అన్నారు. అందులో భాగంగానే ఆరోగ్యశ్రీ, ఆసరా పెన్షన్లు, రేషన్ బియ్యం పెంపు,తెలంగాణ అమరుల కుటుంబాలకు ఉద్యోగాలు, మహిళల కోసం ఫాస్ట్ ట్రాక్ కోర్టులు మొదలైనవి ఎమ్మార్పీఎస్ పోరాడి సాధించిందని అన్నారు. ఈ ఫలితాల అన్ని వర్గాలు పొందుతున్నారని అన్నారు.అందువల్ల సమస్త అణగారిన కులాలకు కేంద్ర బిందువుగా ఎమ్మార్పీఎస్ నిలుస్తుందని అన్నారు.మూడు దశాబ్దాలుగా ప్రజల గొంతుకగా అలుపెరుగని పోరాటాలు చేస్తూ ప్రజల హృదయాల్లో నేటికి సజీవంగా బ్రతికున్న ఏకైన ఉద్యమం ఎమ్మార్పీఎస్ ఉద్యమం అని అన్నారు, తెలంగాణ రాష్ట్రంలో ఉన్న అణగారిన కులాలన్ని ఏ కులానికి ఆ కులం చైతనమై మందకృష్ణ మాదిగ నేతృత్వంలో మహజనులుగా ఏకమై తెలంగాణ రాజకీయల్లో మూడో ప్రత్యామ్నాయ శక్తిగా ఎదగాల్సిన అవసరం ఉందని అన్నారు. ఆ దిశగా అన్ని కులాలు ఆలోచించాలని అన్నారు.

# రెండవ రోజు కొనసాగుతున్న ఉచిత కంటి వైద్య శిబిరం





**పేద ప్రజల కంట్లో వెలుగులు నింపుతున్న సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి**

**ప్రముఖ గైనకాలజిస్ట్ డా.రమ్య**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** కల్వకుర్తి పట్టణ కేంద్రంలోని సి కె ఆర్ ఫంక్షన్ హాల్ లో రెండవ రోజు కొనసాగుతున్న ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సందర్శించిన ప్రముఖ గైనకాలజిస్ట్ మానవతా ఫౌండేషన్ చైర్మన్ డా.రమ్య మాట్లాడుతూ.నిరుపేదలకు ఉచిత కంటి శస్త్ర చికిత్సలతో వారి కంట్లో వెలుగులు నింపుతున్న గొప్ప మనసున్న లీడర్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి అని,కంటి సర్జరీలతో పాటు ఉచిత అద్దాల పంపిణి కూడా చేస్తూ ప్రతి ఒక్కరి కంటి సమస్యకు పరిష్కారం చూపే ప్రయత్నం చేస్తున్నారని వారికి తన ప్రత్యేక అభినందనలు తెలుపుతూ,వైద్య శిబిరానికి విచ్చేసిన ప్రజలతో మాట్లాడుతూ వారికి కంటి చికిత్సలకు సంబంధించిన వివరాలను తెలుసుకొని వారికి,ఉచిత కంటి శస్త్ర చికిత్సలు వాటి అవశ్యకతను వివరించి,ఈ సదవకాశాన్ని అందరికీ తెలియజేయాలని,కల్వకుర్తి పరిసర ప్రాంత ప్రజలందరు కూడా ఈ ఉచిత కంటి వైద్య శిబిరం సేవలు వినియోగించు కోవాలని తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో,మానవతా ఫౌండేషన్ సభ్యులు సందీప్,ప్రవీణ్ లతో పాటు ఐక్యత ఫౌండేషన్ సభ్యులు రచ్చ శ్రీరాములు, నరేందర్ గౌడ్,జైపాల్ రెడ్డి,యూసఫ్, రఘు గణేష్ రమేష్ నాయక్, శ్రీపతి, శేఖర్, రాఘవేందర్,శ్రీను,నాగిళ్ల శివ మహేష్, భాస్కర్,కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

# మొక్కలు మానవుల జీవనాధారం

**45 లక్షల మొక్కలను నాటటమే లక్ష్యం.**

**సీఎం డి బలరాం నాయక్.**

**అగ్నిధార న్యూస్, మంద మర్రిమండలం** జూలై6 భూమి మీద ప్రతి జీవకోటికి మూలా ధారం మొక్కలేనని మొక్కలు అటవీ సంపద లేకుంటే జీవుల మనుగడ కూడా సాధ్యం కాదని సింగరేణి సిఎండి బలరాం నాయక్ అన్నారు.ఆదివారం రామగుండం ఏరియా–1 లో రాష్ట్ర ప్రభుత్వ వనమహోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని స్వయంగా 500 మొక్కలునాటారు. ప్రతి అడుగు పచ్చదనం నినాదంతో ముందుకు పోవాలని పిలుపునిచ్చారు. ఈ ఏడాది 45 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. తెలంగాణ ట్రీ మ్యాన్ గా పేరు తెచ్చుకున్న ఎన్.బలరామ్ 2019 నుండి ఇప్పటి వరకు ఆయన సింగరేణి వ్యాప్తంగా 52 ప్రదేశాలలోస్వయంగా 19,570 మొక్కలను నాటగా అవి నేడు వనాలుగా పెరుగుతున్నాయి. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని,ప్రతి అడుగు పచ్చదనం చేసేలా ప్రతి ఒక్కరూ తమకు గల ఖాళీ ప్రదేశాల్లో కనీసం మూడు మొక్కలను నాటాలని,వాటిని పెంచాలని కోరారు. భావితరాలకు మన వారసులకు మనం ఆస్తులు ఇవ్వాల్సిన అవసరం లేదని మొక్కలను పెంచి వారికి అందిస్తే అదే గొప్ప ఆస్తి అని ఆయన పేర్కొన్నారు.సింగరేణి సంస్థ ఇప్పటికే 14 వేల హెక్టార్లలో ఏడు కోట్లకు పైగా మొక్కలను నాటిందని,అవి నేడు పెద్ద వనాలుగా పెరుగుతున్నాయి అన్నారు.కాబట్టి సింగరేణి ప్రాంతాలు ఇతర ప్రాంతాల కన్నా తక్కువ ఉష్ణోగ్రతలు కలిగి ఉంటున్నాయని, ఇది కేవలం మొక్కలు నాటడం వలన మాత్రమే సాధ్యపడిందన్నారు. కొత్త గనులు ప్రారంభిస్తున్నప్పుడు, రోడ్ల విస్తరణ సందర్భంగా అక్కడ ఉన్న వృక్షాలను తొలగించాల్సి వచ్చినప్పుడు వాటిని నరికి వేయకుండా వాటిని ట్రాన్స్ లోకేషన్



పద్ధతిలో వేరేచోటికి తీసుకెళ్లి తిరిగి నాటడం జరిగిందని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణకు వ్యక్తిగతంగా ప్రథమ ప్రాధాన్యతనిస్తూ.. మొక్కలు నాటుతూ వస్తున్నానని, తాను నాటిన మొక్కలు 40 మినీ వనాలుగా పెరగడం ఎంతోసంతోషంగా ఉందన్నారు.సింగరేణి కాలరీస్ కంపెనీ ఈ ఏడాది 45 లక్షల మొక్కలను నాటాలని లక్ష్యంగా పెట్టుకుందని, ఇప్పటికే సుమారు ఐదు లక్షల మొక్కలు నాటడం జరిగిందన్నారు.అన్ని ఏరియాల్లో మొక్కలు నాటి కార్యక్రమాన్ని ఉధృతంగా చేపట్టాలని ఆయన కోరారు. సీఎండిని ఆదర్శంగా తీసుకున్న రామగుండం ఏరియా వన్ జీఎం లలిత్ కుమార్ తోపాటు ఇతర,అధికారులు, కార్మికులు యూనియన్ నాయకులు 500 మొక్కలను నాటారు. అనంతరం జనరల్ మేనేజర్ లలిత్ కుమార్ మాట్లాడుతూ. ఒక సంస్థకు ఉన్నతాధికారిగా చైర్మన్ గా ఉన్న ఎన్. బలరామ్ స్వయంగా మొక్కలు నాటుతూ అందరికి స్ఫూర్తిదాయకంగా నిలిచారని,ఆయనను ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిఎంఓఎఐ అధ్యక్షులు బి. మల్లేష్, ఏఐటియుసి డిప్యూటీ సెక్రటరీ మడ్డి ఎల్లయ్య, సేవా అధ్యక్షురాలు,అనిత లలిత్ కుమార్, ఏరియా ఉన్నతాధికారులు, కార్మికులు కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## మత సామరస్యానికి ప్రతీక మొహరం

**మార్కెట్ కమిటీ చైర్మన్ యాట గీత నరసింహ**



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** కడ్తాల్ మండలంలోని మక్త మాదారం గ్రామంలో ఆదివారం మొహరం పండుగ వేడుకల్లో మార్కెట్ కమిటీ చైర్మన్ యాట గీత నర్సింహా పాల్గున్నారు .ఈ సదర్భంగా పీర్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్థానిక ముస్లిం సోదరులు శాలువా తో సన్మానించారు.ఈసందర్భంగా మార్కెట్ చైర్మన్ యాట గీత నరసింహ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాలలో పిర్ల పండుగను కులమతాలకు అతీతంగా ప్రజలు జరుపుకోవడం జరుగుతుందని పండుగ వాతావరణం తో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో, అమనగల్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట నర్సింహా ముదిరాజ్, కల్వకుర్తి నియోజవర్గ మైనార్టీ నాయకుడు, షాబుద్దీన్, కిసాన్ సెల్ మండల అధ్యక్షులు బాలరాజ్, చెన్నయ్య, నారాయణ, యాదయ్య, చంద్రయ్య, ముస్లిం, సోదరులు శంషాద్దీన్, సాదిక్, మనవరాలి కరీం, మూఈస్,సమీర్, మైబోలి, నవాజ్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** కల్వకుర్తి మండలం మార్చాల గ్రామానికి చెందిన జంపల్లి జంగయ్య మరియు దండుగుల కవిత అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స చేసుకున్న అనంతరం ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకోవడంతో బాధితులు జంగయ్య కి,30,000 వేలు,దండుగుల కవిత కి19,5000 వేల రూపాయల చెక్కును కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో మార్చాల గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో కల్వకుర్తి నియోజకవర్గం అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో నడుస్తుందని అన్నారు. అనంతరం బాధితులు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్చాల గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల చారి ట్రబులు ట్రస్టు ద్వారా నిరుపేద కుటుంబానికి చేయూత

**ట్రస్టు ఛైర్మెన్ ఉప్పల వెంకటేష్**



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** తలకొండపల్లి మండలం బల్సుల పల్లి గ్రామాలోని కొరికి రాల తండా కు చెందిన ఇస్లావత్ సురేష్ తండ్రి లక్ష్మణ్ నిరుపేద కుటుంబానికి చెందినవాడు కావడంతో వారు నిర్మించుకున్న ఇంటి నిర్మాణం ఆర్ధిక పరిస్థితుల వలన అసంపూర్తిగా మిగిలిపోవడంతో స్థానిక బి ఆర్ ఎస్ పార్టీ నాయకుల ద్వారా తెలుసుకున్న ఉప్పల చారిటబుల్ మాజీ మిషన్ భగీరథ వైస్ చైర్మన్ స్థానిక మాజీ జడ్పిటిసి వెంకటేష్ తన ట్రస్ట్ ద్వారా సిమెంట్ బస్తాలు అందజేయడం జరిగింది. కుటుంబ సభ్యులు మాజీ మిషన్ భగీరథ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ కి ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఇస్లావత్ రవి, ఇస్లావత్ బాలు, ఇస్లావత్ సురేష్ తదితరు పాల్గొన్నారు

## పార్టీలు,కండువాలు వేరైనా బీజేపీ, కాంగ్రెస్ విధానం ఒక్కటే..

**అగ్ని ధార న్యూస్, మందమర్రి మండలం జూలై 6** మందమర్రి సీఐటీయూ అధ్వర్యంలో.. కార్మికుల బైక్ ర్యాలీ జెండా ఊపి, ప్రారంభించి మాట్లాడిన సంకె రవి సీపీఎం జిల్లా కార్యదర్శి.

పాల్గొన్న దూలం శ్రీనివాస్.సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు,దుంపల రంజిత్ కుమార్ సిఐటియు జిల్లా కార్యదర్శి.కార్మికులు. కేంద్రంలోని బిజెపి,మోడీ రాష్ట్రంలోని కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వాలు పార్టీలు, కండువాలు మాత్రమే వేరు పరిపాలన విధానం బడా పెట్టుబడు దారులు కార్పొరేట్ లా ఖజానా నింపడానికి కార్మిక వర్గాన్ని కట్టు బానిసలు చేయడమే వారి లక్ష్యం.ఈ నిరంకుషత్వ విధానాలకు వ్యతిరేకంగా జులై 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని, సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం ఆధ్వర్యంలో..మందమర్రి అంబేడ్కర్ విగ్రహం నుండి,కార్మిక వాదాలు,మార్కెటింగ్ గుండా బస్టాండ్ వరకు బైక్ ర్యాలీ ప్రదర్శన చేయడం జరిగింది.ఈ సందర్భంగా, నాయకులు మాట్లాడుతూ...కేంద్రంలో మూడవసారి అధికారంలోకి వచ్చిన బిజెపి మోడీ ప్రభుత్వం మొదటి నుండే రైతు, కార్మిక,వివిధ తరగతుల ప్రజలపై ఏదో ఒక రూపంలో దాడి చేస్తూనే ఉంది. గతంలో రైతులపై మూడు నల్ల చట్టాలతో దాడి చేస్తే,వాటిని తిప్పి కొట్టడానికి రైతాంగ మంతా,పెద్ద ఎత్తున పోరాటాని నడిపించి, మూడు చట్టాలను తిప్పికొట్టారు.అలాగే ఈరోజు కార్మిక వర్గంపై కూడా లేబర్ కోడ్ ల పేరుతో కార్మికులకు ఉన్న 49 చట్టాల నుంచి 29 చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్ లు తెచ్చి బడా పెట్టుబడిదారులకు, కార్పొరేట్లకు వారి ఖజానా నింపుకోవడానికి కార్మిక వర్గాన్ని కట్టు బానిసలుగా బలి చేస్తున్నారు.ఈ లేబర్ కోడ్ లను తిప్పి కొట్టడానికి కార్మిక వర్గానికి అండగా ఈరోజు దేశవ్యాప్తంగా ఉన్న స్వతంత్ర ఫెడరేషన్లు రైతు సంఘాలు,రైతు కూలీల సంఘాలు,అసోసియేషన్లు, విద్యార్థి సంఘాలు, విద్యుత్తు రంగ కార్మికులు ఇలా అన్ని రంగాల ప్రజలు ఈ పోరాటానికి మద్దతుగా నిలబడుతుంటే రేవంత్ రెడ్డి ప్రభుత్వం మాత్రం బిజెపి మోడీ ప్రభుత్వాన్ని సమర్థిస్తూ జీవో నెంబర్ 282 పేరుతో 12 గంటల విధానాన్ని అమలు చేయమని సర్క్యులేరు జారీ చేయడం కార్మిక వర్గాన్నే కాక నమ్మి ఓటేసిన తెలంగాణ రాష్ట్ర ప్రజల యొక్క నమ్మకాన్ని వమ్ము చేయడమే అవుతుంది. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక ఈ లేబర్ కోడ్ లను రద్దు చేయకుంటే రాబోయే రోజుల్లో దేశవ్యాప్తంగా నిరవధిక సమ్మెలకు కూడా రైతంగ పోరాట స్ఫూర్తితో పోరాటాలకు సిద్ధమవుతామని హెచ్చరిస్తున్నాం. ఈ కార్యక్రమంలో ఎస్సి కేస్ సిఐటియు మందమర్రి బ్రాంచ్ అధ్యక్ష కార్యదర్శులు గందం రవి,రమేష్ నాయకులు తిరుపతి,సంగి పోషం వి.నిర్మల, రాజేంద్ర ప్రసాద్,రవీందర్,శ్రీధర్, రాయమల్లు,కొమ్మురయ్య, తిరుపతి,నరేష్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ కనీసం మూడు మొక్కలనైనా నాటాలి

## 14వేల హెక్టార్లలో ఏడు కోట్లకు పైగా మొక్కలు నాటాం

## ఈ ఏడాది 45లక్షల మొక్కలను నాటడమే మా లక్ష్యం

## మొక్కలు నాటడం వల్లే ఉష్ణోగ్రతలు తగ్గుముఖం

## వన మహోత్సవంలో సింగరేణి సిఎండి బలరాం



**అగ్నిధార న్యూస్ (రామగుండం):** పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కనీసం మూడు మొక్కలనైనా నాటాలని సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ అండ్ బలరాం విజ్ఞప్తి చేశారు.ఆదివారం ఆర్జీవన్ ఏరియాలోని సివిల్ డిపార్ట్మెంట్ ఫిల్టర్ బెడ్ వద్ద మనోత్సవ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించారు.చైర్మన్ ముఖ్యఅతిథిగా హాజరై 500 మొక్కలు నాటి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.అనంతరం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు.ప్రతి అడుగు పచ్చదనం కోసమే ఉండాలని,ఇందుకోసం ప్రతి ఒక్కరూ తమకు గల ఖాళీ ప్రదేశాలలో కనీసం మూడు మొక్కలను నాటడంతో పాటు వాటిని పెంచాలని కోరారు.భావితరాలకు,వారసులకు ఆస్తులు ఇవ్వాల్సిన అవసరం లేదని,మొక్కలను పెంచి వారికి అందిస్తే అదే గొప్ప ఆస్తి అన్నారు.సింగరేణి ఇప్పటికే 14వేల హెక్టార్లలో ఏడు కోట్లకు పైగా మొక్కలను నాటిందని,అవి ఇప్పుడు పెద్ద వనాలుగా పెరుగుతున్నాయన్నారు.సింగరేణి ప్రాంతాలు ఇతర ప్రాంతాల కన్నా తక్కువ ఉష్ణోగ్రతలు కలిగి ఉంటున్నాయని మొక్కలు నాటడం వల్ల మాత్రమే సాధ్యపడిందన్నారు.కొత్త గనులు ప్రారంభిస్తున్నప్పుడు,రోడ్ల విస్తరణ సందర్భంగా అక్కడ ఉన్న వృక్షాలను తొలగించాల్సి వచ్చినప్పుడు వాటిని నరికి వేయకుండా ట్రాన్స్ లోకేషన్ పద్ధతిలో మరోప్రదేశానికి తీసుకెళ్లి తిరిగి నాటామని గుర్తు చేశారు. పర్యావరణ పరిరక్షణకు వ్యక్తిగతంగా ప్రథమ ప్రాధాన్యతనిస్తూ మొక్కలు నాటుతూ వస్తున్నామని,తాను నాటిన మొక్కలు 40 మినీ వనాలుగా పెరగడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. సింగరేణి ఈ ఏడాది 45 లక్షల మొక్కలను నాటాలని లక్ష్యంగా పెట్టుకుందని,ఇప్పటికే సుమారు ఐదు లక్షల మొక్కలు నాతామన్నారు.అన్ని ఏరియాల్లో మొక్కలు నాటి కార్యక్రమాన్ని ఉధృతంగా చేపట్టాలని బలరాం పిలుపునిచ్చారు. అనంతరం ఆర్జీవన్ జనరల్ మేనేజర్ లలిత్ కుమార్ మాట్లాడుతూ ఒక సంస్థకు చైర్మన్ గా బాధ్యతలు నిర్వహిస్తూ స్వయంగా మొక్కలు నాటుతూ అందరికి స్ఫూర్తిదాయకంగా నిలిచారని,చైర్మన్ ను ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిఎంఓఎఐ అధ్యక్షులు బి.మల్లేష్ ఏఐటియుసి డిప్యూటీ సెక్రటరీ మడ్డి ఎల్లయ్య,సేవా అధ్యక్షురాలు అనిత లలిత్ కుమార్,యస్ ఓటు జిఎం ఆంజనేయ ప్రసాద్,డీజీఎం ఫారెస్ట్ కర్ణ,పర్సనల్ మేనేజర్ రవీందర్ రెడ్డి,ఏఐటియుసి సెంట్రల్ సెక్రటరి కే.స్వామి,అరెల్లి పోషం,సీనియర్ పర్సనల్ అధికారులు నాగుల వేణు,హనుమంత రావు,ఇతర ఏరియా జిఎం లు ఎజంట్స్ మేనేజర్లు,అధికారులు పాల్గొన్నారు.

# శాలివాహన సంఘం అధ్యక్షులుగా వెంకటేష్





**అగ్నిధార న్యూస్ వనపర్తి జిల్లా:** వనపర్తి పట్టణ కుమ్మరి శాలివాహన సంఘం సభ్యులు శనివారంరోజు నూతన కమిటీ ఏర్పాటు చెయ్యడం జరిగింది.శాలివాన సంఘం నూతన కమిటీ అధ్యక్షులుగా బొడ్డుపల్లి వెంకటేష్ ఏకగ్రీవంగా నియమితులయ్యారు.ప్రధాన కార్యదర్శిగా సూగురు శీను, కోశాధికారి గా గుణగంటి స్వామి నరసింహ ఉపాధ్యక్షులు బొడ్డుపల్లి తిరుపతయ్య,శీను సిద్దేశ్వరం,గౌరవ అధ్యక్షులుగా బొంబాయి కొండన్న,గౌరవ సలహాదారులు బొడ్డుపల్లి కొండన్న సూగురు వెంకటయ్య,సూగురు రాము, బొడ్డుపల్లి పరుశురాం ,సూగురు రామస్వామి,గుణగంటి తిరుపతయ్య నియమించారు.శాలివాన సంఘంసభ్యులు నూతనంగా ఎన్నుకోబడిన అధ్యక్షులు బొడ్డుపల్లి వెంకటేష్ కిశాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా అధ్యక్షులు మాట్లాడుతూ శాలి వాహన సంఘం అధ్యక్షులుగా నియమించినందుకు మొదటగా సంఘంసభ్యులందరికీ "తొలి ఏకాదశి"శుభాకాంక్షలు తెలుపుతూ సంఘం నియమ నిబంధనలు కట్టుబడి ఉంటూ, భవిష్యత్తులో శాలివాన సంఘాన్ని అభివృద్ధి పరుస్తూ ముందుకు తీసుకెళ్లే విధంగా పనిచేస్తానని అన్నారు

# పాత్రికేయులకు సన్మానం

### ప్రజా సమస్యల కోసం శ్రమించేది పాత్రికేయులు మాత్రమే

### మానవ వికాస వేదిక కళామండలి రాష్ట్ర అధ్యక్షుడు రామస్వామి.



**అగ్నిధార న్యూస్ కమాన్ పూర్** ప్రజా సమస్యల కోసం శ్రమించేది పాత్రికేయులు మాత్రమే అని మానవ వికాస వేదిక కళామండలి రాష్ట్ర అధ్యక్షులు దాసరి రామస్వామి అన్నారు.ఆదివారం కమాన్ పూర్ ప్రెస్ క్లబ్లో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఇటీవలే పెద్దపల్లి జిల్లా టియుడబ్ల్యూజే(ఐజేయు) ఎన్నికల్లో జిల్లా సంయుక్త కార్యదర్శిగా సీనియర్ జర్నలిస్ట్ జబ్బార్ ఖాన్, జిల్లా కార్యవర్గ సభ్యునిగా గాదె బాలయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారికి అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. నిరంతరం ప్రజా సమస్యల కోసం శ్రమించే జర్నలిస్టుల సేవలు మరువలేనివని అన్నారు. పలువురు మాట్లాడుతూ జర్నలిస్టు వృత్తి సమాజంలో ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ఎండకడుతూ సామాన్యులకు సంక్షేమ పథకాలు అందేందుకు కృషి చేసే వృత్తి జర్నలిజం అని పేర్కొన్నారు. జబ్బార్ ఖాన్ 30 సంవత్సరాల పైచిలుకు పాత్రికేయునిగా పనిచేస్తూ మండలంలోని సమస్యలను ఎప్పటికప్పుడు అధికారులకు, ప్రభుత్వానికి తెలియజేస్తూ వార్త కథనాలు రాయడం సంతోషదాయకం అన్నారు. అలాగే వీరితోపాటు పాత్రికేయులు బండ సాయి శంకర్ ఆరేపల్లి శంకర్లను సైతం శాలువాలతో సన్మానించారు. అనంతరం సామ్రాట్ రాజేష్ పాత్రికేయులకు డైరీ పెన్ను అంబేద్కర్ ఫోటోలను అందజేశారు.ఈ మానవ వికాస వేదిక కళామండలి రాష్ట్ర అధ్యక్షులు దాసరి రామస్వామి, సామ్రాట్ రాజేష్, అంబటి కనకయ్య డాన్స్ మాస్టర్ దేవ కాసరవి సదయ్య లక్ష్మణ్ నర్సింగరావు ,మ్యాజిక్ శశి ,సంచు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# అబద్దపు పునాదుల మీద రాజకీయం చేయడం

### బిఆర్ఎస్ పార్టీకి తగదు

### కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్ రెడ్డి



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** తలకొండపల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ, గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో విధ్వంసం సృష్టిస్తు గతంలో పదవులు అనుభవించినవాళ్లు, పదేళ్లు అధికారంలో ఉండి ఏమీ చేయనివారు వీధి వీధినా నాటకాలకు బయలుదేరారు.అని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్ రెడ్డి అన్నారు.పదేళ్ల పాలనలో నెత్తిమీద అప్పు, చేతిలో చిప్ప పెట్టారు. వాళ్లు పదేళ్లలో చేసిన విధ్వంసం వందేళ్లయినా కోలుకోలేని పరిస్థితి. తెలంగాణ రాష్ట్రాన్ని దిగజారిన ఆర్థిక వ్యవస్థగా మార్చి మనకు అప్పగించారు. అద్దాల మేడలు కట్టి, రంగుల గోడలు చూపించారు. ఫీజు రీయింబర్స్ మెంట్, రైతు రుణమాఫీ చేయలేని పరిస్థితికి గత ప్రభుత్వం తీసుకొచ్చింది. వరి వేసుకుంటే ఉరే అని చెప్పిన ప్రభుత్వం ఆనాటి ప్రభుత్వం.రైతులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి నుంచి ఆత్మ గౌరవంతో బ్రతికే పరిస్థితి కల్పించాం ఇది మా ప్రభుత్వ పనితీరు.అని ఆయన అన్నారు.చావుల పునాదులపై అధికారంలోకి రావాలని దురాలోచనతో ప్రతిపక్షం ప్రయత్నిస్తుంది.అయినా ప్రజలు అన్ని గమనిస్తున్నారు, మీ అబద్దపు ప్రచారాలు విష ప్రచారాలు నమ్మే పరిస్థితిలో లేరు,రాబోయే రోజుల్లో అసలైన సమాధానం ప్రజలు చెబుతారు అని ప్రభాకర్ రెడ్డి అన్నారు.

## బియ్యం నిత్యావసర సరుకులు అందజేత

### ఆశ్రమం లోని చిన్నారులకి అన్నదాన కార్యక్రమం.



**అగ్ని ధార న్యూస్,( రామగుండం):** ఎన్టీపీసీ కాశీపల్లి కి చెందిన ఎన్సిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేకల శ్రీధర్ యాదవ్ కుమారుడు మేకల శ్రీయాన్స్ కార్తికేయ యాదవ్ మొదటి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు...ఈ సందర్భంగా స్థానిక తబితా ఆశ్రమాన్ని సందర్శించి అక్కడ ఉన్న చిన్నారులతో కలిసి కేక్ కట్ చేసి పుట్టినరోజు వేడుకలను జరుపుకున్నారు...ఈ వేడుకలో భాగంగా ఆశ్రమ చిన్నారుల కోసం అన్నదాన కార్యక్రమం నిర్వహించడంతో పాటు బియ్యం, నిత్యావసర సరుకులు కూడా అందజేశారు. చిన్నారులతో కలిసి సమయం గడిపిన శ్రీధర్ యాదవ్ ఈ ఆనందాన్ని ఆశ్రమ చిన్నారులతో పంచుకోవడం చాలా సంతృప్తిని కలిగించిందని తెలిపారు.ఈ సందర్భంగా ఆశ్రమ నిర్వాహకులు మేకల శ్రీధర్ యాదవ్ కుటుంబాన్ని అభినందించి, వారి సేవా మనోభావాన్ని ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో చెన్నూరు నాగరాజు శివకుమార్, మహేష్, నాగార్జున, మణిదీప్, రాజ్ కుమార్, ప్రవీణ్, శ్రీనివాస్, ముజ్జు, శశి, స్వామి తదితరులు పాల్గొన్నారు...

## శభాష్....సింగరేణి చైర్మన్

### 20వేలకు పైగా మొక్కలు నాటిన బలరాం

### బాధ్యతగా పర్యావరణ పరిరక్షణ



**అగ్ని ధార న్యూస్,( రామగుండం):** పర్యావరణ పరిరక్షణకు సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్ బలరాం నడుం బిగించారు.ఒకవైపు సింగరేణి వల్ల విధ్వంసం జరుగుతున్నప్పటికీ మరో వైపు ఈ విధ్వంసాన్ని కొంతవరకైనా అధిగమించేందుకు తనవంతుగా పర్యావరణాన్ని పరిరక్షిస్తున్నారు.అధికారం హోదా పక్కన పెట్టి సాధారణ శ్రామికుని వలె పలుగు,పార పట్టుకొని స్వయంగా వేలాది మొక్కలు నాటారు.ప్రతి ఒక్కరూ తప్పకుండా తప్పనిసరిగా మొక్కలు నాటాలని పిలుపునిస్తున్నారు.తెలంగాణ ట్రీ మ్యాన్ గా పేరు తెచ్చుకున్న ఎన్.బలరామ్ 2019 నుండి ఇప్పటి వరకు ఆయన సింగరేణి వ్యాప్తంగా 52 ప్రదేశాలలో స్వయంగా 19,570 మొక్కలను నాటి శభాష్ అనిపించుకున్నారు.చైర్మన్ నాటిన మొక్కలు ప్రస్తుతం వనాలుగా పెరుగుతున్నాయి.ఆదివారం గోదావరిఖనిలో వెయ్యి మొక్కలు నాటేందుకు సింగరేణి ఆర్జీవన్ యాజమాన్యం వనమహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించింది.బలరాం ముఖ్యఅతిథిగా హాజరై స్వయంగా 500 మొక్కలను నాటి అందరికీ ఆదర్శంగా నిలిచారు.

## రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామికి ఘన స్వాగతం



**అగ్నిధారన్యూస్,( రామగుండం):** చెన్నూరు ఎమ్మెల్యే డాక్టర్ వివేక్ వెంకటస్వామి నూతనంగా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గా పదవి బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటి సారిగా గోదావరిఖని కి వస్తున్న సందర్భంగా ఆదివారం రోజున సింగరేణి గుర్తింపు సంఘం ఐన సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి వివేక్ వెంకటస్వామి కి ఘన స్వాగతం పలికింది. గోదావరిఖని మున్సిపల్ జంక్షన్ నుంచి మార్కేండయ కాలనీ లోని ఆర్ కె గార్డెన్ వరకు జరిగిన ర్యాలీలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య వివేక్ వెంకటస్వామి వెంట ఉంటూ ర్యాలీ లో పాల్గొనడం జరిగింది, అనంతరం ఆర్ కె గార్డెన్ లో జరిగిన అభినందన సభలో ఏఐటియుసి పక్షాన వివేక్ వెంకటస్వామి ని నాయకులు ఘనంగా సన్మానించారు. సింగరేణి కి సంబంధించిన దీర్ఘకాలిక సమస్యల పై ఈ కార్యక్రమంలో ఏఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శులు మడ్డి ఎల్లా గౌడ్, వై. వి.రావు, సిపిఐ నగర కార్యదర్శి కనకరాజు తో పాటు ఏఐటియుసి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఉచిత వైద్య కంటి శిబిరం



**అగ్నిధారన్యూస్ పెద్దపల్లి** తెలంగాణ రాష్ట్ర ఐటి శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు పుట్టినరోజు సందర్భంగా నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో కంటి పరీక్ష చేపించుకున్న 20 మంది ప్రజలకు కంటి ఆపరేషన్ అవసరం ఉన్న వారికి ఆపరేషన్ చేపిస్తానని ఇచ్చిన హామీ మేరకు ఆదివారం శ్రీ వైద్య ఫౌండేషన్, గుమ్మడి ప్రసాద్ ఆధ్వర్యంలో కంటి ఆపరేషన్ కోసం హైదరాబాద్ కి పంపించడం జరిగింది.

# ఎస్సీ ఎస్టీ జర్నలిస్టులకు సంక్షేమ పథకాలను కేటాయించాలి


**రాష్ట్ర ఎస్సీ ఎస్టీ మైనార్టీ వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్ కు వినతిపత్రం అందజేత.**



**అగ్ని ధార న్యూస్,( ధర్మపురి):** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను దళిత గిరిజన జర్నలిస్టులకు ప్రత్యేకంగా కేటాయించాలని తెలంగాణ ఎస్సీ ఎస్టీ వర్కింగ్ జర్నలిస్టు అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర ఎస్సీ ఎస్టీ మైనార్టీ వికలాంగుల వయోవృద్ధుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కు వినతిపత్రం అందజేశారు. ఆదివారం ధర్మపురి పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ను ఎస్సీ ఎస్టీ జర్నలిస్టు నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని దళిత గిరిజన జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. అనంతరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల రాజశేఖర్ మాట్లాడుతూ రాష్ట్రంలో వివిధ ఛానళ్లు పత్రికలలో దళిత గిరిజన జర్నలిస్టు ఏండ్ల తరబడి తరబడి పనిచేస్తున్నారని వారంతా చాలీచాలని వేతనాలతో జీవితం విల్లవిస్తున్నారని మంత్రితో తెలిపారు. అదేవిధంగా కుటుంబ భారంతో సతమతమవుతున్నారని వారిని రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రత్యేకంగా కేటాయించి ఆర్థికంగా ఆదుకోవాలని మంత్రికి విన్నవించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాస్ పథకం, ఇందిరమ్మ ఇండ్లు, అంబేద్కర్ అభయ హస్తం వంటి పథకాలను ప్రత్యేకంగా కేటాయించాలని కోరారు. అదేవిధంగా ఇంటి స్థలాలు, ఇందిరమ్మ ఇండ్లు వెంటనే ఇవ్వాలని మంత్రిని కోరారు. అందుకు మంత్రి లక్ష్మణ్ కుమార్ స్పందిస్తూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఏ సంక్షేమ పథకమైన దళిత గిరిజనకు ప్రత్యేకంగా కేటాయించి ఆర్థికంగా అభివృద్ధి చెందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఎస్సీ ఎస్టీ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ పెద్దపెల్లి జిల్లా నాయకులు బందెల శ్రీనివాస్ ధర్మపురి నియోజకవర్గ అధ్యక్షులు స్వామి నాయకులు దేవేందర్ పాల్గొన్నారు.

# వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి రెడ్డి పర్యటన

**వివిధ అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు**



**అగ్నిధార న్యూస్ వనపర్తి జిల్లా:** వనపర్తి నియోజకవర్గం లో ఈనెల 7న వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్నారు.వనపర్తి పట్టణ సమీపంలో రాజపేట గ్రామ శివారు తన స్కూల్ పాఠశాల ఎదురుగా రూ.3.50 కోట్లతో నిర్మిస్తున్న అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారని, ఆ తర్వాత ఉదయం 11 గంటలకు వనపర్తి పట్టణంలోని మహిళా డిగ్రీ కళాశాలలో 40 లక్షల రూపాయల వ్యయంతో చేపడుతున్న మైంటెనెన్స్ పనులను ప్రారంభిస్తారు.12 గంటలకు గోపాల్పేట మండలం బుద్ధారం గండిలోని మాత్మ గాంధీ గురుకుల పాఠశాల గురుకుల పాఠశాలలో రూ. 13.50 లక్షలతో నిర్మించిన సైన్స్ ల్యాబ్ ను ప్రారంభిస్తారు. అదేవిధంగా మధ్యాహ్నం 1:00 గంటలకు గోపాల్పేట మండలం లోని నాగపూర్ గ్రామంలో రూ. 22 లక్షల (పిఎసిఎస్ నిధుల నుంచి) నిర్మించిన సింగిల్ విండో షాపింగ్ కాంప్లెక్స్ ను ప్రారంభిస్తారు.మధ్యాహ్నం 1 :30 గంటలకు రేవల్లి మండల కేంద్రంలో రూ. 38 లక్షల వ్యయంతో నిర్మించిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పిఎసిఎస్ నిధులు) సింగిల్ విండో షాపింగ్ కాంప్లెక్స్, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయ భవనం ప్రారంభోత్సవం ఉంటుందని,కావున ఇట్టి కార్యక్రమాలకు వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్, పెబ్బేరు మార్కెట్ యార్డ్ చైర్మన్ వైస్ చైర్మన్ లు, జిల్లా గ్రంథాలయాల అధ్యక్షులు, పిసిసి సభ్యులు,ఆయా మండలాల కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు నాయకులు, కార్యకర్తలు పార్టీ శ్రేణులు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, యూత్ అధ్యక్షులు, పట్టణ అధ్యక్షులు, మాజీ జెడ్పిటిసిలు, మాజీ ఎంపీపీలు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, సింగిల్ విండో అధ్యక్షులు, మాజీ మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, మాజీ పట్టణ కౌన్సిలర్లు, ఆయా మండలాల ఎస్సీ ఎస్టీ బీసీ, మైనార్టీ సంఘాల అధ్యక్షులు, సభ్యులు, మహిళా అధ్యక్షురాలు, మహిళా సంఘం సభ్యురాలు, కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంస్థ ఎన్ ఎస్ యు ఐ సంఘం నాయకులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతంచేయాలని ఆ పార్టీ శ్రేణులు పిలుపునిచ్చారు.

## కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి

## మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

**వనపర్తి :** ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలను అరిగోస పెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు తాము కాంగ్రెస్ పార్టీ అని చెప్పుకోలేని దుస్థితి ఏర్పడింనది వెల్లడించారు. ఆదివారం వనపర్తి జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో యువ నాయకుడు ఏరువ సాయిప్రసాద్ యాదవ్‌తో పాటు కాంగ్రెస్, బీజేపీలకు చెందిన యువకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి సింగిరెడ్డి మాట్లాడుతూ రైతు భరోసా కింద రూ. 15వేలు ఇస్తామని, ఆసరా పింఛన్లు రూ. 4వేలు , కల్యాణ లక్ష్మితో పాటు తులం బంగారం ఇస్తామని మోసం చేశారరని ఆరోపించారు. మహిళలకు రూ. 2,500ఇస్తామని, ధాన్యంపై క్వింటాలుకు బోనస్ రూ. 500ఇస్తామని ఎగ్గొట్టారని ఎద్దేవా చేశారు. ఇందిరమ్మ ఇళ్లకు ఎన్నో ఆంక్షలు పెట్టి అర్హులకు అందకుండ చేస్తున్నారని విమర్శించారు. బీఆర్‌ఎస్ హయంలో నియోజకవర్గంలో 3,250 డబుల్ బెడ్ రూమ్స్ కట్టించామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ తప్పిదాలను నాయకులు,కార్యకర్తలు ప్రజలకు వివరించి స్థానిక సంస్థల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించాలని నిరంజన్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమములో పార్టీ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్, జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్ , పార్టీ మండల అధ్యక్షులు కే.మాణిక్యం, జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్, కురుమూర్తి యాదవ్, సింగిల్ విండో అధ్యక్షులు రఘువర్ధన్ రెడ్డి, మాజీ సర్పంచ్ భాను ప్రకాష్ రావు, నాయకులు మాధవ్ రెడ్డి, రవిప్రకాష్ రెడ్డి, దేగ మహేశ్వర్ రెడ్డి, చిట్యాల రాము, ఇమ్రాన్, మాజీ కౌన్సిలర్లు నాగన్న యాదవ్, ప్రేమ్ నాథ్ రెడ్డి, నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# మట్టిలో చేతులు భారతదేశంలో హృదయాలు



**అగ్నిధారన్యూస్ పెద్దపల్లి** హరిత భారత్ లక్ష్యంగా చిల్డ్రన్ ఇస్లామిక్ ఆఫ్ ఇండియా దేశవ్యాప్తంగా మట్టిలో చేతులు-భారతదేశంలో హృదయాలు అనే నినాదంతో జమాతే ఇస్లామీ హింద్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా 10 లక్షల మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో భాగంగా జూన్ 25 నుండి జూలై 25 వరకు ఆరు సంవత్సరాల నుండి 12 సంవత్సరాలు ఒక పిల్లలతో దేశవ్యాప్తంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు జమాతే ఇస్లామీ హింద్ పెద్దపెల్లి జిల్లా అధ్యక్షులు అబ్దుల్ హై జావిద్, పట్టణ అధ్యక్షులు ఎం ఏ మోహిద్ తెలిపారు. ఆదివారం రోజున స్థానిక ఫారన్ మోడల్ స్కూల్, కాలేజీ ఆవరణలో పిల్లలతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి లయన్స్ క్లబ్ పెద్దపల్లి సభ్యులు వెంకటేశ్వర్ మాట్లాడుతూ భారతదేశంలో ఒక వ్యక్తికి కేవలం 20 చెట్లు మాత్రమే ఉన్నాయని, కెనడాలో ఒక వ్యక్తికి 9,000 చెట్లు, చైనాలో ఒక వ్యక్తికి 1500 చెట్లు ఉన్నాయని, భారతదేశంలో అడవి సంపద 33 శాతం నుండి 15 శాతానికి పడిపోయిందని, కాబట్టి పిల్లలు చిన్నతనం నుండే చెట్లను పెంచే అలవాటును ఏర్పరచుకోవాలని దీని ద్వారా భారత దేశంలో అడవి సంపద పెరిగి అనేక లాభాలు ఉంటాయని, జమాత్ ఇస్లాం హింద్ ఆధ్వర్యంలో పిల్లలచే ఈ కార్యక్రమాన్ని చేపట్టడం అభినందనీయమని తెలిపారు. అనంతరం జిల్లా అధ్యక్షులు పట్టణ అధ్యక్షులు మాట్లాడుతూ చెట్లు సమస్త మానవాళికి ఉపయోగపడతాయని, చెట్లను పెంచడం వల్ల వాతావరణ కాలుష్యం తగ్గి, భారతదేశం అభివృద్ధికి తోడ్పడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కావేటి రాజగోపాల్, మీసాల సత్యనారాయణ, వేల్పుల రమేష్, జైపాల్ రెడ్డి, సాయిలు, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు జవేరియా కౌసర్, పట్టణ అధ్యక్షురాలు రషీదా, కన్వీనర్ మాలిహా ఇరం, మహిమోద, నజియా, జమాత్ సభ్యులు పాల్గొన్నారు.

## పెంపుడు జంతువుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి

**నాగర్ కర్నూల్ :** పెంపుడు జంతువులపై ప్రతి ఒక్కరు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు.అదివారం ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా పెంపుడు జంతువులకు టీకా శిబిరం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ బి.సంతోష్ మాట్లాడుతూ జంతువుల ద్వార మనుషులకు వ్యాపించే వ్యాధులపై అప్రమత్తత అవసరమని అన్నారు.జూనోసిస్ వ్యాధుల నివారణకు,మన ఆరోగ్య రక్షణకు నివారణ కీలకమని పెంపుడు జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే భయంకర వ్యాధులు సోకకుండా ఉండేందుకు జంతువుల యజమానులు వాటికి టీకాలు వేయించాలని జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించటమే జునోసిస్-డే ఉద్దేశమని కలెక్టర్ తెలిపారు.ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం జూలై 6న, జరుపుకుంటామని ఈ జూనోసిస్ వ్యాధి పట్ల జంతు యజమానులకు అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం ద్వారానే వివిధ కార్యక్రమాలను అవగాహనా సదస్సులను నిర్వహిస్తున్నామన్నారు.జంతు ప్రేమికులకు తమ పెంపుడుజంతువులపై అమితప్రేమ ఉంటుందని కుటుంబసభ్యుల తరహాలోనే పెంపుడు జంతువు పట్ల భిమానం పెంచుకుని పెంపుడు జంతువులకు చిన్నపాటి హాని జరిగినా విలవిలలాడి డిపోతారని ఆ జంతువుల పట్ల సరైన జాగ్రత్తలు తీసుకోకుంటే అవి ప్రాణాంతక వ్యాధులకు కారణమవుతాయని జంతు ప్రేమికులు ప్రతి ఒక్కరూ ఈ విషయాలను గమనించాలని,జూనోసిస్ వ్యాధులు జంతువుల నుండి మనుషులకు సంక్రమించే వ్యాధులని వీటిలో రేబిస్,బర్డ్ ఫ్లూ,స్వైన్ ఫ్లూ ఉన్నాయని, జంతువుల పట్ల జాగ్రత్తగా ఉండటం,పరిశుభ్రత పాటించడం,టీకాలు వేయించడంతో జూనోసిస్ వ్యాధులను నివారించుకొని తమ రోగ్యాన్ని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని,జూనోసిస్ వ్యాధుల గురించి అవగాహన పెంచుకోవాలని,జిల్లా యంత్రాంగం వ్యాధుల నివారణకు చర్యలు తీసుకుంటుందని కుక్కలద్వారా వ్యాప్తిచెందే అతిభయంకర వ్యాధి రేబీస్ అని,యాంటీ రేబీస్ టీకాను కోర్సు ప్రకారం కుక్కలకు వేయించాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. అనంతరం రేబీస్ వ్యాధి సోకకుండా ముందు జాగ్రత్తగా పెంపుడు జంతువుల యజమానులకు, పశు వైద్య అధికారులకు కూడా ఈ సందర్భంగా టీకాలు వేశారు.అనంతరం పశుసంవర్ధక శాఖ అధికారి కార్యాలయ ఆవరణలో అధికారులతో కలిసి కలెక్టర్ మొక్కను నాటారు. కార్యక్రమంలో జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి డాక్టర్. బి.జ్ఞాన శేఖర్,వైద్య ఆరోగ్యశాఖ ఇమినైజేషన్ అధికారి రవి నాయక్,పశుసంవర్ధక,వైద్య ఆరోగ్య శాఖల అధికారులు,సిబ్బంది జంతువుల యజమానులు, పాల్గొన్నారు.

## సిపిఐ నేత కు ఆత్మీయ సత్కారం.



**అగ్ని ధార న్యూస్,( రామగుండం):** విశాఖ ఉక్కు కర్మాగారం లో విధులు నిర్వహించి 34 ఏళ్ల సుదీర్ఘ కాలం వివిధ హోదాలలో పని చేసి ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన జి. ఆనంద్ ను సీపీఐ రామగుండం నగర సమితి అభినందించింది . ఆదివారం గోదావరిఖని లో ఆనంద్ ను సీపీఐ సమితి నేతలు శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా సీపీఐ నగర సమితి కార్యదర్శి కె. కనక రాజు మాట్లాడుతూ ఆనంద్ ఉద్యోగానికి పూర్వం గోదావరిఖని లో ఏ. ఐ.ఎస్ ఎఫ్ జిల్లా నేతగా ఎదిగారని ఆయన కొనియాడారు. సీపీఐ జిల్లా పూర్వ కార్యదర్శి గౌతం గోవర్ధన్ మాట్లాడుతూ ఆనంద్ విద్యార్థి సమస్యల పై ఉమ్మడి కరీంనగర్ జిల్లా లో పోరాడారని అన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో సిపిఐ టి. రమేష్ కుమార్ , వై.లెనిన్ , శనిగరపు చంద్ర శేఖర్ పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో రుక్మిణి పాండురంగడికి ప్రత్యేక పూజాకార్యక్రమాలు



**అగ్నిధారన్యూస్ "(సంగారెడ్డి)"** సంగారెడ్డి జిల్లా మండలకేంద్రమైన రాయికోడ్ తో పాటు పలు గ్రామాల్లో ఆషాడమాసం తొలి ఏకాదశి ని పురస్కరించుకుని ఆదివారం అర్చకుల వేదమంత్రోచ్చారణలతో శ్రీరుక్మిణి పాండురంగడికి అభిషేకం,అలంకరణ ప్రత్యేక పూజా కార్య క్రమాలు మహాహారతి ఇచ్చి తీర్థప్రసాదాలు వితరణ చేయడం జరిగింది,అనంతరం భక్తులు ఉపవాసం ఉండి శ్రీరుక్మిణిపాండురంగడి పాద స్పర్శదర్శనం చేసుకున్నారు.అలాగే రాయికోడ్ లో భగవంతుని నామస్మరణ తో భజన చేసుకుంటూ ఊరిలో,ఊరు శివారులో ఉన్న దేవి దేవ తలకు పూజాకార్యక్రమాలు నిర్వహించారు,రాత్రి ఆలయ సన్నిధిలో భజన చేయడం జరిగింది.

## గ్రామపంచాయతీల భవన నిర్మాణాలకు నిధులు


- మంజూరైన ప్రతి గ్రామపంచాయతీకి 20 లక్షల రూపాయల నిధులు.
- మంత్రికి కృతజ్ఞతలు తెలుపుతున్న మంజూరైన గ్రామపంచాయతీ ల ప్రజలు , ప్రజా ప్రతినిధులు.
- మంత్రి శ్రీ దుద్దిళ్ళ శ్రీధర్ బాబు.



**అగ్నిధార న్యూస్ మంథని :** మంథని నియోజకవర్గంలోని పెద్దపల్లి జిల్లాకు సంబంధించి మంథని, రామగిరి, ముత్తారం, కమాన్ పూర్ మండలాల్లో 12 గ్రామపంచాయతీ నూతన భవనాలకు మంత్రి శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష నూతన భవనాలను మంజూరు చేసి నూతన భవనాలకు 2 కోట్ల 40 లక్షలు నిధులు మంజూరు చేయడం జరిగింది.

**మంథని మండలంలోని నూతన గ్రామపంచాయతీ భవనాలు :**

అడవి సోమనపల్లి -20 లక్షలు ఖానాపూర్ -20 లక్షలుమల్లేపల్లి - 20 లక్షలు అరెంద - 20 లక్షలు ఉప్పట్ల - 20 లక్షలుగోపాల్ పూర్ - 20 లక్షలుతోట గోపాయపల్లి - 20 లక్షలు ముత్తారం మండలంలోని నూతన గ్రామపంచాయతీ భవనాలు : జిల్లల్లపల్లి - 20 లక్షలు రామగిరి మండలంలోని నూతన గ్రామపంచాయతీ భవనాలు : నాగేపల్లి - 20 లక్షలు జల్లారం - 20 లక్షలుముస్త్యాల - 20 లక్షలు కమాన్ పూర్ మండలంలోని నూతన గ్రామపంచాయతీ భవనాలు : సిద్దిపల్లి -20 లక్షలు మంజూరైన ప్రతిగ్రామపంచాయతీకి 20 లక్షల రూపాయల నిధులను 4 మండలాలకు గాను 12 గ్రామపంచాయతీ నూతన భవనాలకు 2 కోట్ల 40 లక్షలు మంత్రి ఆదేశాల మేరకు కలెక్టర్ మంజూరు చేయడం జరిగింది.మంథని, రామగిరి, ముత్తారం, కమాన్ పూర్ మండలాల్లో మంజూరైన నూతన గ్రామపంచాయతీ భవనాలు సంబంధించిన గ్రామాలలోనీ ప్రజలు, ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ఐటి , పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు కు కృతజ్ఞతలు తెలిపారు.



## మెగాఫోన్ పట్టిన 'కేరాఫ్ కంచరపాలెం' నిర్మాత.. ఇంట్రెస్టింగ్‌గా 'కొత్తపల్లిలో ఒకప్పుడు' టీజర్

'కేరాఫ్ కంచరపాలెం', 'ఉమా మహేశ్వర ఉగ్రరూపస్య' లాంటి చిత్రాలతో సూపర్ హిట్‌లను అందుకున్న నిర్మాత ప్రవీణ పరుచూరి ఇప్పుడు మెగాఫోన్ పట్టి దర్శకురాలిగా మారింది. ఆమె దర్శకత్వంలో రాబోతున్న తాజా చిత్రం కొత్తపల్లిలో ఒకప్పుడు దగ్గుబాటి రానా ఈ సినిమాకు సమర్పకుడిగా వ్యవహారిస్తుండగా.. పరచూరి విజయ్ ప్రవీణ ఆర్ట్స్ బ్యానర్‌పై గోపాలకృష్ణ పరుచూరి %ండ% ప్రవీణ పరుచూరి నిర్మిస్తున్నారు. రూరల్ బ్యాక్‌డ్రాప్‌లో రాబోతున్న ఈ సినిమా జూలై 18న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్. కామెడీ బ్యాక్‌డ్రాప్‌లో ఈ సినిమా రాబోతుంది. ఈ సినిమాతో మనోజ్ చంద్ర, మోనిక టి, ఉషా బోనెలను వెండితెరకు పరిచయం చేస్తుండగా.. రవీంద్ర విజయ్, బెనర్జీ, బొంగు సత్తి, ఫణి, ప్రేంసాగర్ తదితరులు కీలక పాత్రలో నటిస్తున్నారు.

## 20 ఏళ్లకే హీరోయిన్‌గా ఎంట్రీ.. 40 ఏళ్ల బాలీవుడ్ స్టార్‌తో సినిమా..

రణ్‌వీర్ సింగ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న యాక్షన్ మూవీ దురంధర్ సంజయ్ దత్, ఆర్.మాధవన్, అర్జున్ రాంపాల్, అక్షయ్ ఖన్నా కీలక పాత్రల్లో నటించారు. నేడు (జూలై 6) రణ్‌వీర్ బర్త్‌డే సందర్భంగా దురంధర్ మూవీ టీజర్ రిలీజ్ చేశారు. ఇందులో హీరో మాస్ అవతార్‌లో కనిపించాడు. అలాగే ఓ హీరోయిన్‌ను ఎత్తుకుని తిప్పుతూ కనిపించాడు.

చైల్డ్ ఆర్టిస్ట్ నుంచి హీరోయిన్‌గా..

ఆ హీరోయిన్ మరెవరో కాదు.. చైల్డ్ ఆర్టిస్ట్ సారా అర్జున్. ప్రముఖ నటుడు రాజ్ అర్జున్ కూతురే సారా. సౌత్‌లో బాలనటిగా ఎన్నో సినిమాలు చేసిన ఆమె.. దురంధర్‌తో హీరోయిన్‌గా వెండితెరపై ఎంట్రీ ఇస్తోంది. ఈమె తెలుగులో దాగుడుమూత దండాకోర్ చిత్రంలో రాజేంద్రప్రసాద్ మనవరాలిగా నటించింది. నాన్న మూవీలో విక్రమ్ కూతురిగా మెప్పించింది. తమిళ, హిందీ భాషల్లో పలు చిత్రాలు చేసింది. పొన్నియన్ సెల్వన్ మూవీలో ఐశ్వర్యరాయ్ చిన్ననాటి పాత్రలో మెరిసింది.

20 ఏళ్ల ఏజ్ గ్యాప్

చైల్డ్ ఆర్టిస్ట్‌గా బోలెడంత పాపులారిటీ సంపాదించిన సారా.. అప్పుడే హీరోయిన్‌గా మారడంతో సినీప్రియులు ఆశ్చర్యపోతున్నారు. అందులోనూ 40 ఏళ్ల రణ్‌వీర్‌తో 20 ఏళ్ల సారా కలిసి నటించడంపై అప్పుడే చర్చ మొదలైంది. వీళ్లిద్దరూ జంటగా నటించారా? లేదంటే ఏదైనా మిషన్ కోసం ఇలా కలిశారా? అన్నది క్లారిటీ రావాల్సి ఉందని అభిప్రాయపడుతున్నారు. ఇక ఈ సినిమా డిసెంబర్ 5న విడుదల కానుంది. అదే రోజు ప్రభాస్ ది రాజాసాబ్ మూవీ రిలీజ్ అవుతుండటం గమనార్హం.





## నాకొక ఐడెంటిటీ ఇచ్చారు.. స్టేజ్‌పై సమంత ఎమోషనల్



ఇంటర్నెట్‌డెస్క్: నటి సమంత తానా వేడుకల్లో పాల్గొన్నారు. అభిమానులు చూపిస్తోన్న ప్రేమ పట్ల భావోద్వేగానికి గురయ్యారు. "తానా వేడుకల్లో పాల్గొనడానికి 15 ఏళ్లు పట్టిందంటే నమ్మలేకపోతున్నా. ప్రతి ఏడాది తానా, ఇక్కడ ఉన్న తెలుగువారి గురించి వింటూనే ఉంటాను. నా తొలి చిత్రం 'ఏమాయ చేసావె' నుంచి నన్ను మీ మనిషిలా భావించారు. నాపై ప్రేమను చూపించారు. మీ ప్రేమాభిమానాలకు ధన్యవాదాలు చెప్పడానికి నాకు ఇన్ని ఏళ్లు పట్టింది" అంటూ శిరస్సు వంచి నమస్కారం చేశారు. "కెరీర్ పరంగా ముఖ్యమైన దశలో ఉన్నాను. ట్రాలాలా పేరుతో నిర్మాణ సంస్థను ప్రారంభించా. నిర్మాతగా 'శుభం'తో తొలి అడుగు వేశా. నార్త్ అమెరికాకు చెందిన తెలుగువారు మా చిత్రాన్ని ఎంతగానో మెచ్చుకున్నారు. మంచి ఫలితాన్ని అందించారు. జీవితంలో ఎలాంటి నిర్ణయం తీసుకున్నా.. ఏదైనా తప్పు చేసినా.. మీరు ఎప్పుడూ నా వెంటే ఉన్నారు. అందుకు గర్వపడుతున్నా. ఎక్కడికి వెళ్లినా, ఏం చేసినా, ఏ పరిశ్రమలో పనిచేసినా.. 'తెలుగు ప్రేక్షకులు నన్ను చూసి గర్వపడతారా? లేదా?' అనే ఆలోచిస్తాను. ఇన్నేళ్ల ప్రయాణంలో నాకు మద్దతుగా నిలిచినందుకు ధన్యవాదాలు. మీరు నాకొక ఐడెంటిటీ, కుటుంబాన్ని ఇచ్చారు. 'ఓబేబీ' మిలియన్ డాలర్ క్లబ్‌లోకి చేరడం మీవల్లే సాధ్యమైంది. ప్రాంతాలను బట్టి మీరు నాకు దూరంగా ఉండొచ్చు.. కానీ మీరెప్పటికీ నా మనసులోనే ఉంటారు" అంటూ ఆమె భావోద్వేగానికి గురయ్యారు. కంటతడి పెట్టుకున్నారు.

## 'లక్కీ భాస్కర్' సీక్వెల్ చేస్తా: వెంకీ అట్లూరి

**హైదరాబాద్:** దుల్కర్ సల్మాన్ హీరోగా దర్శకుడు వెంకీ అట్లూరి రూపొందించిన చిత్రం 'లక్కీ భాస్కర్' బ్యాంకింగ్ సెక్టార్ నేపథ్యంలో వచ్చిన ఈ చిత్రం గతేడాది విడుదలై ఘన విజయాన్ని అందుకుంది. ఈ చిత్రానికి సీక్వెల్ తీసే ఆలోచనలో ఉన్నట్లు వెంకీ అట్లూరి తాజాగా ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. 'లక్కీ భాస్కర్'కు తప్పకుండా సీక్వెల్ ఉంటుందన్నారు. సీక్వెల్‌కు సంబంధించిన ఇతర వివరాలను మాత్రం ఆయన వెల్లడించలేదు. 'లక్కీ భాస్కర్' విజయం తర్వాత సూర్య హీరోగా వెంకీ కొత్త సినిమా రూపొందిస్తున్నారు. ఇటీవల ఈ సినిమా అధికారికంగా ప్రారంభమైంది. సూర్య 46వ ప్రాజెక్ట్‌గా సిద్ధమవుతోన్న ఈ సినిమాపై ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "లక్కీ భాస్కర్' సక్సెస్ అయ్యాక బయోపిక్స్ చేయాలని పలువురు నిర్మాతలు నన్ను సంప్రదించారు. కానీ, నాకు మాత్రం వాటిని తెరకెక్కించడం ఇష్టం లేదు. అదే విధంగా థ్రిల్లర్, పీరియాడిక్ చిత్రాలు రూపొందించాలనే ఆసక్తి లేదు. కుటుంబం మొత్తం కలిసి కూర్చొని చూసేలా అందమైన కుటుంబ కథా చిత్రాలను చేయాలనిపించింది. అందుకు అనుగుణంగానే ఇప్పుడు సినిమా చేస్తున్నా" అని అన్నారు. సూర్యకు తాను వీరాభిమానిని అని అన్నారు. సూర్యకు తాను రెండు, మూడు కథలు చెప్పానని.. అందులో నుంచి ఆయన ఒక స్టోరీ ఎంచుకున్నారని తెలిపారు. ఇది పూర్తిగా కుటుంబ కథా చిత్రమన్నారు. తెలుగు, తమిళ భాషల్లో నిర్మితం కానున్న ఈ సినిమా వచ్చే ఏడాది వేసవికి ప్రేక్షకుల ముందుకు రానుంది. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్నారు. మమితా బైజు (%మీఖఎత్ష్ఘు దీఖఱయబ%) కథానాయిక. రవీనా టాండన్, రాధిక కీలక పాత్రలు పోషిస్తున్నారు.

## అడివి శేష్ 'డెకాయిట్' షూటింగ్‌లో జాయిన్ అయిన మృణాల్ ఠాకూర్



టాలీవుడ్ యువ నటుడు అడివి శేష్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'డెకాయిట్. షానీల్ డియో దర్శకత్వంలో రాబోతున్న ఈ సినిమాలో కథానాయికగా మృణాల్ ఠాకూర్ నటిస్తున్నారు. ఈ సినిమాను హిందీ, తెలుగు భాషల్లో ఏకకాలంలో చిత్రీకరిస్తుండగా.. ఇటీవలే విడుదలైన సినిమా పవర్–ప్యాక్డ్ గ్లింప్స్‌కు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన లభించింది. అయితే ప్రస్తుతం హైదరాబాద్‌లో శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రంలో నటి మృణాల్ ఠాకూర్ జాయిన్ అయ్యింది. ఈ విషయాన్ని ఆమె స్వయంగా సోషల్ మీడియాలో పోస్ట్ చేసి ప్రకటించారు. ప్రస్తుత షెడ్యూల్‌లో మేకర్స్ అడివి శేష్, మృణాల్ ఠాకూర్‌పై కొన్ని కీలక సన్నివేశాలను చిత్రీకరించనున్నారు. ఈ చిత్రంలో ప్రకాష్ రాజ్, సునీల్, అతుల్ కులకర్ణి, జైన్ మేరీ ఖాన్, అనురాగ్ కశ్యప్, కామక్షి భాస్కర్లా వంటి ప్రముఖ నటులు కూడా భాగమయ్యారు. ఈ సినిమాకు అడివి శేష్ మరియు షానీల్ డియో సంయుక్తంగా కథ, స్క్రీన్‌ప్లే అందించారు. సుప్రియ యార్లగడ్డ ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌ను నిర్మిస్తుండగా, సునీల్ నారంగ్ సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. అన్నపూర్ణ స్టూడియోస్ ఈ చిత్రాన్ని సమర్పిస్తోంది. భీమ్స్ సెసిరోలియో ఈ సినిమాకు సంగీతం అందిస్తున్నారు.

Printed Published Edited and Owned by Chegonda Ravikumar Yadav.Printed at Sri Laxmi Printing Press H.NO.4_6_157 Peddapalli Pin co.505172 State Telangana
RNI TITLE CODE:TELTEL/2024/89359 EDITOR: Chegonda Ravikumar Yadav Contact Number.8008817828. Email.agnidharanews@gmail.com http://www.agnidharanews.com